కలం నిఘా
WWW.KALAMNIGHA.COM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ : శనివారం 31 ఆగస్టు 2024
సంపుటి: 14, సంచిక: 148, పేజీలు 7, వెల: 4.00
Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam

నేను ఇక్కడ దిగిన వెంటనే..

# శివాజీ విగ్రహం కూలింది

**శివాజీ భారీ విగ్రహం కూలిన ఘటనలో క్షమాపణలు కోరిన ప్రధాని మోడీ**




ముంబయి ఆగస్ట్ 30 (నిఘా న్యూస్) మహారాష్ట్ర లో ఛత్రపతి శివాజీ భారీ విగ్రహం కూలిన ఘటనపై విపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఘటనపై తాజాగా ప్రధాని మోదీ క్షమాపణలు ..మిగతా 2లో

పారాలింపిక్‌లో

# భారత్ బోణీ

**ఒకే రోజు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్**



2

వాష్ రూమ్స్‌లో...

# సీక్రెట్ కెమెరాలు

**నాలుగు రోజుల్లో విచారణ పూర్తి చేసి నిందితులను శిక్షిస్తాం: మంత్రి కొల్లు**

## గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల బాలికల హాస్టల్‌లో దారుణం

- తమ జీవితాలను నాశనం చేశారంటూ విద్యార్థినిల ఆవేదన
- న్యాయం చేయాలంటూ ఆందోళన
- వీడియోలు బయటకు రాకుండా చర్యలు తీసుకుంటామని భరోసా
- మంత్రి కొల్లు హామీతో ఆందోళన విరమించిన బాలికలు
- విచారణ పూర్తయ్యే వరకు తరగతులకు హాజరు కారాదని నిర్ణయం
- సీసీ కెమెరాలు ఎక్కడా లేవంటూ జిల్లా ఎస్పీ ప్రకటన



విజయవాడ ఆగస్ట్ 30(నిఘా న్యూస్) గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థినిలు ఆందోళనను విరమించారు. కళాశాల హాస్టల్ వాష్ రూమ్‌ల్లో హిడెన్ కెమెరాల ఘటన కలకలం రేపింది. తమ జీవితాలను నాశనం చేశారంటూ విద్యార్థినిలు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. ఒక విద్యార్థి, విద్యార్థినులు కలిసి కెమెరా అమర్చారని వారు ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో దిగిన మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేలు కుమార్ రాజా, వెంకట్రావు, కృష్ణ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు రంగంలోకి దిగారు.విద్యార్థినులతో ..మిగతా 2లో



టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట

# టెంపుల్ బోర్డు

**హైదరాబాద్ బయట వేయి ఎకరాలలో మరో జూపార్క్**

**స్పీడ్ ప్రాజెక్టులపై సమీక్షలో సీఎం రేవంత్**

హైదరాబాద్ ఆగస్ట్ 30(నిఘా న్యూస్) రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి నూతన విధానం రూపొందించాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. 'స్పీడ్' ప్రాజెక్టులపై సచివాలయంలో నిర్వహించిన సవిరీక్షలో ఆయన మాట్లాడుతూ ఎకో, టెంపుల్ పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. హెల్త్ టూరిజంను అభివృద్ధి చేయాలని చెప్పారు. హైదరాబాద్ బయట మరో జూపార్క్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. యాదగిరిగుట్ట అభివృద్ధిపై అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. తితిదే బోర్డు మాదిరే యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు ..మిగతా 2లో




సుప్రీంకు రేవంత్

# క్షమాపణలు

**న్యాయ వ్యవస్థపై అత్యంత గౌరవం ఉందని వేడుకోలు**

2

వైసీపీకి ఇద్దరు

# ఎమ్మెల్సీల గుడ్ బై



**కర్రి పద్మశ్రీ, బల్లి కల్యాణ్ చక్రవర్తి ఎమ్మెల్సీ పదవులకూ రాజీనామా**

2

# జన్వాడ ఫాంహౌజ్‌కు అనుమతులు లేవు



**నిర్ధారణకు వచ్చిన పంచాయితీ అధికారులు**

**ఫాంహౌస్ యజమాని ప్రసాదరాజు చిరునామాకు నోటీసులు**

హైదరాబాద్ ఆగస్ట్ 30(నిఘా న్యూస్) జన్వాడ ఫాంహౌస్‌కు రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల నుంచి ఎలాంటి అనుమతులేవని అధికారులు ప్రాథమిక సమాచారం సేకరించినట్లు తెలిసింది. హైదరాబాద్ సవిరీపంలోని శంకర్‌పల్లి మండలం జన్వాడ రెవెన్యూ పరిధిలో ఉన్న ఈ ఫాంహౌస్ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అధీనంలో ఉండడం, బుల్కాపూర్ నాలా బఫర్‌జోన్ పరిధిలో ఉందన్న ప్రచారంతో చేవెళ్ల రెవెన్యూ డివిజన్ అధికారులు అంతర్గతంగా పలు ..మిగతా 2లో

ఫిర్యాదు అందిన రెండు రోజుల్లో...

# రామ్‌నగర్‌లో హైడ్రా కూల్చివేతలు

హైడ్రా దూకుడుపై హర్షం వ్యక్తపరిచిన స్థానికులు



2

మాట ముచ్చట పూర్తయింది...

ఇక అమెరికాలో

# అప్పగింతలు

**రాసి పెట్టుకోండి కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం ఖాయం**

**అందుకే 38 మంది ఎమ్మెల్యేలున్నా రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయలేదు**

**బీజేపీ సభ్యత్వ నమోదులో బండి సంజయ్ వ్యాఖ్యలు**



హైదరాబాద్ ఆగస్ట్ 30(నిఘా న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో 2028లో జరిగే ఎన్నికల్లో రానున్నది బిజెపి ప్రభుత్వమేనని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ జోస్యం పలికారు. అతి తక్కువ సమయంలో ప్రజావ్యతిరేకత మూటగట్టుకున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని విమర్శించారు. బీఆర్ఎస్ మళ్లీ వచ్చే పరిస్థితి లేదని, అంతారాసి పెట్టుకోండి 2028లో రానున్నది రామ ..మిగతా 2లో

బ్రహ్మంగారు నివసించిన...

# రవ్వలకొండను తవ్వేశారు



**అడవుల్లో అడుగు పెడితే అదే చివరి రోజు**

**వైసీపీ పాలనలో నదులు, కొండలు, గుట్టలు కూడా మాయం**

**వన మహోత్సవంలో చంద్రబాబు, పవన్**

అమరావతి ఆగస్ట్ 30(నిఘా న్యూస్) ఏపీలో అడవులు నరికితే కఠిన చర్యలు తీసుకుంటామని స్మగ్లర్లను ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అడవుల్లో అడుగుపెడితే అదే వారికి చివరిరోజు అవుతుంది. జాగ్రత్త అంటూ హెచ్చరించారు. వన మహోత్సవం కార్యాక్రమంలో భాగంగా శుక్రవారం మంగళగిరిలోని ఎకో పార్కులో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో కలిసి ..మిగతా 2లో



15 ఏళ్లుగా దేవాదుల

# నత్త నడక

**దేవాదుల ప్రాజెక్టును సందర్శించిన మంత్రుల బృందం**

**ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి.. పనుల పురోగతిపై సమీక్ష**

ములుగు ఆగస్ట్ 30(నిఘా న్యూస్) 15 ఏళ్లుగా దేవదుల ప్రాజెక్ట్ నత్తనడకగా సాగుతోందని, 2026 మార్చి నాటికి పూర్తి చేసి, సోనియా గాంధీతో ప్రారంభిస్తామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. 300 రోజుల పాటు నీటిని ఎత్తిపోసేలా ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తాం అన్నారు. పెండిరగ్ బిల్లులు అన్ని క్లియర్ చేస్తాం అన్న మంత్రులు. పొరుగు రాష్ట్రాలతో సత్ సంబంధాలతో ఉంది. త్వరితగతిన ప్రాజెక్టు పనుల చేపడతాం అన్నారు. గత ప్రభుత్వం కేవలం పనులు చేశారు జేబులు నింపుకున్నారు కానీ ప్రజలకు లాభం జరగలేదు. లక్ష 80 వేల కోట్లు ఇరిగేషన్ శాఖ పైనా ఖర్చు చేసిన గత బిఆర్ఎస్ పాలకులు పనుల పేరుతో జేబులు నింపుకున్నరని ..మిగతా 2లో

ఏపీ పోలీసుల వేధింపులపై

# ఆధారాలున్నాయి

**విచారణ కమిషన్ ముందు నటి జత్వానీ హాజరు**

తనకు జరిగిన అన్యాయంపై వివరాలు అందచేత

వీటీపీఎస్ గెస్ట్‌హౌస్‌లో బంధించి వేధించిన పోలీసులపై ఫిర్యాదు

ఆరోపణలు నమోదు చేసుకున్న పోలీసులు

2

అసోం అసెంబ్లీలో...

# నమాజు విరామ సమయం రద్దు

**అసెంబ్లీలో ప్రకటించిన సీఎం హిమంత బిస్వ శర్మ**



2

## నేను ఇక్కడ దిగిన వెంటనే..
# శివాజీ విగ్రహం కూలింది

మొదటి పేజీ తరువాయి...

తెలియజేశారు. 'నేను ఇక్కడ దిగిన వెంటనే.. విగ్రహం కూలడంపై శివాజీకి క్షమాపణలు చెప్పాను. ఈ ఘటన వల్ల బాధకు గురైన వారికి నా క్షమాపణలు తెలియజేస్తున్నాను' అని వెల్లడించారు. 'ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను తమ దైవంగా భావించేవారు ఈ ఘటనతో తీవ్ర వేదనకు గురయ్యారు. నా తలవంచి వారికి క్షమాపణలు చెబుతున్నా. మనకు ఆ దైవం కంటే గొప్పది ఏదీ లేదని మోదీ మాట్లాడారు. శుక్రవారం మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో పర్యటించిన సందర్భంగా ఆయన స్పందించారు. ఛత్రపతి శివాజీ భారీ విగ్రహం కొద్దిరోజుల క్రితం కుప్పకూలిపోయింది. 35 అడుగుల ఎత్తున్న ఈ విగ్రహాన్ని గతేడాది డిసెంబరు 4న నౌకాదళ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి మోదీ ఆవిష్కరించారు. రాష్ట్రంలో కురిసిన వర్షాల కారణంగానే విగ్రహం కూలినట్లు భావిస్తున్నారు, అసలు కారణాన్ని నిపుణులు త్వరలోనే వెల్లడిస్తారని అధికారులు తెలిపారు. కాగా, తొమ్మిది నెలలు కూడా పూర్తి కాకుండానే విగ్రహం కూలిపోవడం పట్ల ప్రతిపక్షాలు మండి పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రచారం మీద ఉన్న దృష్టి, నాణ్యత మీద లేదని దుయ్యబట్టాయి.

## వైసీపీకి ఇద్దరు
# ఎమ్మెల్సీల గుడ్ బై

**కర్రి పద్మశ్రీ, బల్లి కళ్యాణ్ చక్రవర్తి ఎమ్మెల్సీ పదవులకూ రాజీనామా**

**అమరావతి ఆగస్ట్ 30(నిఘా న్యూస్)** ఏపీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన వైసీపీకి ఆ పార్టీ నేతలు వరుసగా గుడ్ బై చెబుతున్నారు. తాజాగా ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, బల్లి కళ్యాణ్ చక్రవర్తి గుడ్ బై చెప్పారు. వీరిద్దరు ఏ పార్టీలో చేరుతారో అన్నదానిపై ప్రకటన చేయలేదు. వైసీపీతో పాటు ఎమ్మెల్సీ పదవులకు కూడా రాజీనామా చేశారు. బల్లి కళ్యాణ చక్రవర్తి నెల్లూరు కు చెందిన వారు. ఆయన మాజీ ఎంపీ బల్లి దుర్గాప్రసాదరావు కుమారుడు. తిరుపతి ఎంపీగా ఉంటూ బల్లి దుర్గా ప్రసాదరావు చనిపోయారు. ఉపఎన్నికల్లో వైసీపీ అధినేత జగన్ దుర్గా ప్రసాదరావు కుటుంబానికి టిక్కెట్ కేటాయించలేదు. సాధారణంగా పదవిలో ఉంటూ ఎవరైనా చనిపోతే ఆ కుటుంబానికి టిక్కెట్ కేటాయిస్తారు. కానీ పాదయాత్రలో తనకు ఫిజియోగా పని చేసిన వైద్యుడు గురుమూర్తికి టిక్కెట్ ఇచ్చారు. బల్లి దుర్గా ప్రసాదరావు కుమారుడు కల్యాణ్ చక్రవర్తికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. ఆయన పదవి కాలం ఇంకో మూడేళ్లు ఉంది. మరో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అయ్యారు. ఆమె భర్త నారాయణరావు వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఉన్నారు. ఆమె బీజేపీ అనుబంధ సంస్థల్లో చురుగ్గా ఉండేవారు. మత్స్యకారుల్లో వాడబలిజ సామాజికవర్గానికి చెందిన ఆమె జాతీయ మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. ఆమెకు బీజేపీకి చెందిన కొంత మంది కీలక నేతలతో సంబంధాలు ఉన్నాయని భావిస్తున్నారు. అయితే ఆమెకు వైసీపీలో ఎమ్మెల్సీ రావడమే ఆ పార్టీలో ఆశ్చర్యానికి కారణం అయింది. ఇప్పటికే ఆమెకు మరో ఐదేళ్ల వరకూ పదవి కాలం ఉంది. ఇప్పుడు రాజీనామా చేసి బీజేపీలో చేరే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. ఇప్పటికే చీరాలకు చెందిన ఎమ్మెల్సీ పోతుల సునీత రాజీనామా చేశారు. అలాగే మరికొంత మంది ఎమ్మెల్సీలు ఇప్పటికే నారా లోకేష్ ను కలిశారు. శాసనమండలిలో మెజార్టీ వైసీపీకే ఉంది. ప్రతిపక్ష నేతగా ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన బొత్సను నియమించారు. ఇప్పుడు వరుసగా ఎమ్మెల్సీలు అంతా రాజీనామాలు చేస్తూండటంతో ఆయన ప్రతిపక్ష నేత హోదా కూడా పోయే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. ఇప్పుడు ఎవరు రాజీనామా చేసినా ఉపఎన్నికల్లో వైసీపీ గెలిచే అవకాశం లేదు. అందుకే ఇతర పార్టీలతో మాట్లాడుకుని వారు రాజీనామాలు చేస్తున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది.

## ఫిర్యాదు అందిన రెండు రోజుల్లో...
# రామ్‌నగర్‌లో హైడ్రా కూల్చివేతలు

**హైదరాబాద్ ఆగస్ట్ 30(నిఘా న్యూస్)** హైదరాబాద్‌లోని అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్‌లో 'హైడ్రా' కూల్చివేతలు చేపట్టింది. రాంనగర్ చౌరస్తాలోని మణెమ్మ కాలనీలో నాలాను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను రెండు రోజుల క్రితం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. దీనిపై నివేదిక సమర్పించాలని జీహెచ్‌ఎంసీ రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. నిర్మాణాలు అక్రమమే అని నిర్ధరించిన అనంతరం హైడ్రా అధికారులు శుక్రవారం ఉదయం కూల్చివేతలు చేపట్టారు. ఇక్కడ విక్రమ్‌యాదవ్ అనే వ్యక్తికి చెందిన స్థలంలో అక్రమంగా కల్లు కాంపౌండ్ కొనసాగుతోందని స్థానికులు రెండు రోజుల క్రితం హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాలు చేపట్టారని అందులో పేర్కొన్నారు. దీంతో స్పందించిన యంత్రాంగం అక్కడి కల్లును పారబోసి పూర్తిగా సామగ్రిని తొలగించి, కూల్చివేతలు చేపట్టింది. ఫిర్యాదు చేసిన రెండు రోజుల్లోనే హైడ్రా చర్యలకు ఉపక్రమించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## అసోం అసెంబ్లీలో...
# నమాజు విరామ సమయం రద్దు

**దిస్పూర్ ఆగస్ట్ 30(నిఘా న్యూస్)** అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వ శర్మ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర అసెంబ్లీలో ప్రతి శుక్రవారం రెండు గంటల పాటు ఇచ్చే నమాజ్ విరామాన్ని రద్దు చేస్తున్నట్టు శుక్రవారం శాసనసభలో ప్రకటించారు. సభా కార్యక్రమాల ప్రొడక్టివిటీని పెంచడంతో పాటు వలస కాలం నాటి పద్ధతులను తొలగించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు అభివర్ణించారు. కాలం చెల్లిన 'జుమ్మా' విరామాన్ని రద్దు చేసేందుకు మద్దతు ఇచ్చిన అసెంబ్లీ స్పీకర్, ఇతర శాసనసభ్యులకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీలో శుక్రవారంనాడు అనుసరించే రెండు గంటల విరామ సమయాన్ని 1937లో ముస్లిం లీగ్‌కు చెందిన సైయద్ సాదుల్లా ప్రవేశపెట్టారు. కాగా, దీనికి ముందు ముస్లిం వివాహాలు, విడాకులను తప్పనిసరిగా రిజిస్టర్ చేయాలనే బిల్లును కూడా గత గురువారంనాడు హిమంత్ బిస్వా ప్రభుత్వం ఆమోదించింది. ఈ బిల్లుతో కాజీ వ్యవస్థ రద్దు కావడంతో పాటు బహుభార్యత్వం, బాల్య వివాహాలకు అడ్డుకట్ట పడుతుందని, బాలికల అభ్యున్నతికి దోహద పడుతుందని సీఎం చెప్పారు. శుక్రవారాల్లో ముస్లిం శాసనసభ్యులు నమాజ్ చేసుకునేందుకు ఉద్దేశించిన రెండు గంటల విరామాన్ని అసోం ప్రభుత్వం రద్దు చేయడాన్ని బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ తప్పుపట్టారు. ముస్లింలను లక్ష్యంగా చేసుకుని చీప్ పాపులారిటీ కోసం అసోం సీఎం ఇలాంటి చర్యలకు పాల్పడినట్టు విమర్శించారు. ముస్లింలను సాఫ్ట్ టార్గెట్ గా బీజేపీ తీసుకుందని ఆరోపించారు. సమాజంలో విద్వేష వ్యాప్తే వారి ఉద్దేశమని, స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింలు కూడా త్యాగాలు చేశారనే విషయాన్ని బీజేపీ విస్మరించరాదని తేజస్వి అన్నారు. కాగా, దశాబ్దాలుగా అమల్లో ఉన్న సంప్రదాయాన్ని మార్చాల్సిన అవసరం ఏముందని ఏఐయూడీఎఫ్ ముస్లిం ఎమ్మెల్యే ఒకరు ప్రశ్నించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే హిమంత్ బిస్వా శర్మ సారథ్యంలోని అసోం బీజేపీ ప్రభుత్వం ముస్లింలను టార్గెట్ చేసుకుందని ఆయన విమర్శించారు.

# వాష్ రూమ్స్‌లో సీక్రెట్ కెమెరాలు

మొదటి పేజీ తరువాయి...

మంత్రి కొల్లు రవీంద్ర పలు దఫాలుగా చర్చలు జరిపారు. మంగళవారం నాటికి విచారణ పూర్తి చేసి, బాధ్యులను శిక్షిస్తామని వారు హామీ ఇచ్చారు. ఎటువంటి వీడియోలు బయటకు రానీయకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. హాస్టల్‌లో విద్యార్థినులకు రక్షణగా మహిళా పోలీసు టీంను ఏర్పాటు చేశారు. మంత్రి రవీంద్ర హామీలకు అంగీకరించిన విద్యార్థినులు తమ ఆందోళనను విరమించారు. విచారణ పూర్తి అయ్యే వరకు తరగతులకు హాజరు కాకూడదని విద్యార్థినిలు నిర్ణయించారు. కాగా కాలేజీలోని బాలికల హాస్టల్‌లో వాష్ రూమ్స్‌లో సీక్రెట్ కెమెరాలు పెట్టారంటూ విద్యార్థులు రాత్రి నుంచి ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. పోలీసుల జోక్యంతో కాస్త సద్దుమణిగినా, తిరిగి ఇవాళ ఉదయం ఆందోళన ప్రారంభమైంది. తమకు న్యాయం చేయాలంటూ విద్యార్థులు నినాదాలు



చేస్తున్నారు. వి వాంట్ జస్టిస్ అంటూ అంటూ ధర్నా చేస్తున్న విద్యార్థిని విద్యార్థులు స్లోగన్స్ ఇస్తున్నారు. అయితే గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో సీసీ కెమెరాలు ఎక్కడా కనిపించలేదంటూ ఇవాళ ఉదయం జిల్లా ఎస్పీ ఒక ప్రకటన జారీ చేశారు. దీనిపై విద్యార్థులే కాకుండా ఉపాధ్యాయ సంఘాలు సైతం మండి పడుతున్నాయి. ఎస్పీ ప్రకటనతో విద్యార్థినులు తమ ఆందోళనను మరింత ఉధృతం చేశారు. చివరకు మంత్రి కొల్లు రవీంద్ర ఇచ్చిన హామీతో విద్యార్థినులు ఆందోళనను విరమించారు. మరోవైపు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ ఘటనపై ఇప్పటికే సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ స్పందించారు. పూర్తి స్థాయిలో దర్యాప్తునకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటనపై స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కూడా స్పందిస్తూ తీవ్రంగా ఖండిరచారు. నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపట్టాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు ఎవరూ ఆందోళన చెందవద్దని అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే రాము భరోసా ఇచ్చారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న రాము గురువారం రాత్రి కళాశాలలో జరిగి పరిణామాలపై తాజాగా స్పందించారు.

# 15 ఏళ్లుగా దేవాదుల నత్త నడక

మొదటి పేజీ తరువాయి...

అన్నారు. ప్రాజెక్టుల పని పేరుతో గత ప్రభుత్వా నేతలు దోచుకున్నారని విమర్శించారు. ములుగు జిల్లాలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద దేవాదుల పంపింగ్ స్టేషన్ ను సందర్శించి, ప్రాజెక్టు ఇంటెక్ వెల్, పంప్ హౌస్ ను పరిశీలించారు. దేవాదుల ప్రాజెక్టును పూర్తి చేయడంపై అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. 2025 డిసెంబర్ నాటికి దేవాదుల ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. 2026 మార్చ్ లో సోనియాగాంధీ చేతుల మీదుగా ప్రాజెక్టును ప్రారంభిస్తామని మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. 38 టీఎంసీల నీరు ఎత్తిపోయడానికి ప్రాజెక్ట్ డిజైన్ చేశారని ప్రస్తుతం సమ్మక్క బ్యారేజ్ నిర్మాణం వల్ల 60 టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందన్నారు మంత్రి ఉత్తమ్. సంవత్సరంలో 300 రోజులపాటు 60 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసి 5.57 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని అన్నారు. గత పది ఏళ్ల కెసిఆర్ హయంలో దేవాదుల ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైందని, కమిషన్ల కక్కుర్తి కోసం కేసీఆర్ ప్రాజెక్టులను ఆగం చేశారని మంత్రి ఉత్తమ్. మండిపడ్డారు. ఇరిగేషన్ శాఖ అడ్డుపెట్టుకుని కేసీఆర్ దోపిడీకి తీరలేపారని ఫైర్ అయ్యారు. ప్రతి ప్రాజెక్టులోను వేలకోట్ల స్కాం జరిగిందని ఆరోపించారు. 1.81 లక్షల కోట్ల నిధులను ఇరిగేషన్ శాఖకు ఖర్చుచేసినా లక్ష ఎకరాలకు అదనంగా సాగునీరు ఇవ్వలేక పోయారన్నారు. 14 వేల కోట్ల బిల్లులు పెండిరగ్ లో ఉంటే, 7వేల కోట్లను తమ ప్రభుత్వం రాగానే చెల్లించిందన్నారు. దేవాదుల ప్రాజెక్టు పెండిరగ్ బిల్లులను సైతం తప్పనిసరిగా చెల్లిస్తామని, నిర్మాణ సంస్థలు ఎటువంటి భయం లేకుండా పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. మరో వైపు దేవదుల ప్రాజెక్ట్ పనులు 15 ఏళ్లుగా నత్తనడకలో సాగాయి. దీన్ని నవంబర్ 15 లోపు దీన్ని పూర్తి చేసి పనులను వేగంగా పూర్తి చేస్తాము. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రైతులకు హామీ ఇచ్చిన మేరకు బూముల నష్టపరిహారం ఇస్తాము అని హామీ ఇచ్చారు. గోదావరి పరివాహక ప్రాంతంలో కట్టిన ప్రాజెక్టులతో ఉమ్మడి వరంగల్ జిల్లాతోబాటు. నల్గొండ,ఖమ్మం జిల్లాలకు పాక్షికంగా నీళ్లు అందుతాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక. దేవాదుల ప్రాజెక్ట్ కి పెద్ద పీట వేయడం జరుగుతుందన్నారు మంత్రి పొంగులేటి. 15 ఏళ్లుగా నత్తనడకలో దేవదుల ప్రాజెక్ట్ సాగుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. 3 లక్షల ఆయకట్టుకు 2026 సంవత్సరా లో ఇచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దేవాదుల ప్రాజెక్ట్ ఇన్ డెప్త్‌గా పరిశీలన చేయడం జరిగిందన్నారు. మూడు వేల ఎకరాలు భూ సేకరణ చేయాల్సి ఉందన్నారు. మంత్రుల పర్యటనలో పాల్గొన్న ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు మంత్రి ఉత్తమ దృష్టికి తీసుకెళ్లారు. వారందరూ సూచనలను పరిగణలోకి తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. అతి త్వరలోనే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఐదున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేస్తామని అన్నారు. భూముల ధరలు పెరగడంతో భూ సేకరణ ఇబ్బందిగా మారిందని రాష్ట్రవ్యాప్తంగా ఇరిగేషన్ ప్రాజెక్టుల భూసేకరణ కోసం ఐఏఎస్ అధికారిని నియమిస్తున్నామన్నారు. సమ్మక్క బ్యారేజ్ ఎన్‌ఓసి కోసం చత్తీస్గడ్ ప్రభుత్వంతో చర్చలు జరిపి త్వరలోనే సి డబ్ల్యూ సి నుండి అనుమతులు తెచ్చుకుంటామన్నారు. నిధుల కొరత ఉన్నప్పటికీ తెలంగాణ గ్రావిరీణ ముఖచిత్ర మార్చడమే లక్ష్యంగా ప్రాజెక్టును గురి చేసే విధంగా ముందు కెళ్తామన్నారు.

## ఏపీ పోలీసుల వేధింపులపై ఆధారాలున్నాయి

**విజయవాడ ఆగస్ట్ 30 (నిఘా న్యూస్)** ముంబయి నటి కాదంబరి జెత్వానీ కేసు విషయంలో ప్రభుత్వం ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించిన క్రమంలో నటి జెత్వానీ శుక్రవారం విజయవాడకు వచ్చారు. మధ్యాహ్నం ఆమె పోలీస్ కమిషనర్‌ను కలిశారు. ఏసీపీ స్రవంతిరాయ్ నేతృత్వంలో ప్రత్యేక బృందం.. జత్వానీ నుంచి వివరాలు తీసుకున్నారు. అత్యాచారం కేసు నుంచి అన్ని పరిణామాలను ఆమె వివరించారు. వీటీపీఎస్ గెస్ట్‌హౌస్‌లో బంధించిన సమయంలో ఏయే పోలీసులు ఎలా ఇబ్బంది పెట్టారో చెప్పిన నటి జత్వానీ కన్నీళ్లు పెట్టుకున్నారు. 2023 డిసెంబర్ నుంచి కేసు పెట్టి.. 2024, మార్చి వరకూ జరిగిన ఘటనలు ఆమె వివరించారు. జత్వానీ వివరణను స్టేట్‌మెంట్, వీడియో రూపంలో కేసు విచారణాధికారులు తీసుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు, ఆమెపై నమోదు చేసిన ఫోర్జరీ కేసునూ విచారణాధికారి పరిశీలించనున్నారు. ఏపీ పోలీసులు అక్రమ కేసులు పెట్టి తనను అనేక విధాలుగా వేధించారని నటి జెత్వానీ ఆరోపించారు. ఆ అధికారులకు సంబంధించిన అన్ని ఆధారాలు తన దగ్గర ఉన్నాయని.. వీటన్నింటినీ ఏపీ ప్రభుత్వానికి అందిస్తానని చెప్పారు. తన కుటుంబ సభ్యులను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేశారని.. ఇప్పుడు సర్కారు తనకు సపోర్ట్ చేస్తుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో కొందరు తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని.. డబ్బుల కోసమే ఇలా మాట్లాడాతున్నానని తన వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు జరిగిన అన్యాయంపై విచారణ జరిపి న్యాయం చేయాల్సిందిగా కోరుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వంపై తనకు పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేశారు. ముంబైకి చెందిన డాక్టర్, నటి కాదంబరి జెత్వానీ పలు మీడియా ఛానెళ్లతో మాట్లాడుతూ ఏపీ ఐపీఎస్ అధికారులు తనను అత్యంత ఘోరంగా వేధించారని.. తనతో పాటు తన తల్లిదండ్రుల్ని కూడా వేధించారని ఆరోపించారు. 40 రోజుల పాటు నిర్బంధించి ఖాళీ పత్రాలపై సంతకం పెట్టించుకుని వదిలి పెట్టారని అన్నారు. ఈ అంశం సంచలనంగా మారిన క్రమంలో ఏపీ ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. సీఎంవోకు ఇంటలిజెన్స్ అధికారులు, విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు నివేదికలు సమర్పించారు. తీవ్ర ఆరోపణలు కావడంతో కేసు దర్యాప్తునకు ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. తన భద్రత, తన కుటుంబ భద్రతపై నటి ఆందోళన వ్యక్తం చేస్తోన్న క్రమంలో ఆమె వద్ద నుంచి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు తీసుకుని దర్యాప్తు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు.. ఆ కేసులో ఆ నటి కుటుంబాన్ని అరెస్టు చేయడానికి ముంబైకి వెళ్లిన బృందం మొత్తాన్ని ఓసారి పిలిపించి మాట్లాడారు. కృష్ణా జిల్లా వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ తమను రూ.5 లక్షలకు నటి కాదంబరి జెత్వానీ మోసం చేసిందని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. కేసు నమోదు చేసి.. విమానాల్లో ముంబైకి వెళ్లి ఆ కుటుంబాన్ని పోలీసులు తీసుకు వచ్చినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా ఇలా వేరే రాష్ట్రాలకు వెళ్లి ఓ సినీ నటిని చీటింగ్ కేసులో అరెస్టు చేస్తే ప్రెస్ మీట్ పెట్టి చెప్పేవారు. అయితే కాదంబరి జెత్వానీ కుటుంబాన్ని తీసుకొచ్చి 40 రోజులు విజయవాడలో ఉంచినా సరే మీడియాకు సమాచారం ఇవ్వకుండా పూర్తిగా అంతర్గతంగానే ఉంచినట్లు తెలుస్తోంది.

## పారాలింపిక్స్‌లో భారత్ బోణీ

**పారిస్, ఆగస్ట్ 30(నిఘా న్యూస్)** 2024 పారాలింపిక్స్‌లో భారత పారా అథ్లెట్లు అదరగొడుతున్నారు. విశ్వక్రీడలు ప్రారంభమైన రెండో రోజే పతకాల ఖాతా తెరిచారు. పారా షూటర్ అవని లెఖరా శుక్రవారం జరిగిన మహిళల 10మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో పసిడి పతకం నెగ్గింది. ఈ ఈవెంట్లో 249.7పాయింట్లతో అవని సత్తా చాటింది. గత టోక్యో పారాలింపిక్స్‌లోనూ గోల్డ్ నెగ్గిన అవని, ఈసారి పారిస్‌లోనూ సత్తా చాటి పసిడి ముద్దాడింది. టోక్యోలో 249.6పాయింట్లు సాధించిన అవని ఈసారి తన రికార్డును మెరుగుపర్చుకుంది. ఈ క్రమంలో పారాలింపిక్స్‌లో రెండు గోల్డ్ మెడల్స్ నెగ్గిన రెండో భారత పారా అథ్లెట్‌గా అవని రికార్డు సృష్టించింది. అయితే 11 ఏళ్ల వయసులో కారు ప్రమాదానికి గురికావడం వల్ల అవని కాళ్లు రెండూ చచ్చుబడిపోయాయి. అప్పటి వరకు ఆమె లోకం వేరు! చదువు తప్ప వేరే ధ్యాస లేదు. ఆ తర్వాత ఆమె ఆర్చరీవైపు దృష్టి పెట్టి దీన్నే కెరీర్‌గా మలుచుకుంది. ఇక మరోవైపు ఇదే ఈవెంట్‌లో మోనా అగర్వాల్ మూడో స్థానంలో నిలిచి కాంస్యం ముద్దాడింది. ఈమె 228.7 పాయింట్లు సాధించింది. ఇక సౌత్ కొరియా పారా అథ్లెట్ యె లీ 246.8 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ పతకం దక్కించుకుంది. స్ప్రింటర్ ప్రీతి పాల్ 100 (T35) మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానంలో నిలిచి కాంస్యం దక్కించుకుంది. ఈ ఈవెంట్‌లో ప్రీతి ఆమె 14.21 సెకన్లలో పరుగు పూర్తి చేసింది. కాగా, ఈ విభాగంలో ఇదే ప్రీతి బెస్ట్ టైమ్. ఇక తొలి రెండు స్థానాలను చైనాకు చెందిన అథ్లెట్లు కైవసం చేసుకున్నారు. రేస్‌ను 13.58 సెకన్లలో ముగించిన జియా జౌ పసిడి ముద్దాడగా, 13.74 సెకన్లలో పరుగును పూర్తి చేసిన గౌ రజకం దక్కించుకుంది. భారత పారా షూటర్ మనీశ్ నర్వాల్ శుక్రవారం జోరు ప్రదర్శించాడు. పురుషుల 10మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో రెండో స్థానంలో నిలిచిన మనీ

## జన్వాడ ఫామ్‌హౌజ్‌కు అనుమతులు లేవు

మొదటి పేజీ తరువాయి...

అంశాలను సేకరించారని సమాచారం. ఈ ఫాంహౌస్‌ను మీర్జాగూడ గ్రామ పంచాయతీ పరిధిలో ఎనిమిదేళ్ల క్రితం నిర్మించారు. అప్పట్లో గ్రామ పంచాయతీ కార్యదర్శి అక్రమ కట్టడంగా గుర్తించారని తెలుస్తోంది. ఫాంహౌస్ యజమాని ఎన్.ఎస్.ఎల్.ఆర్.ప్రసాదరాజు చిరునామాకు నోటీసులు సైతం పంపించారని సమాచారం. ఆయన స్పందించక పోవడంతో పంచాయతీ ఆదాయం నిమిత్తం కొద్దిరోజుల తర్వాత ఫాంహౌస్‌కు ఇంటి నంబర్ 4-5 కేటాయించి అసెస్‌మెంట్ చేశారు. ఫాంహౌస్ విస్తీర్ణం 362 గజాలని, 3,200 చదరపు అడుగుల్లో ఉందని గ్రామపంచాయతీ అధికారులు లెక్కలు వేసి, ఏటా రూ.11 వేలు పన్ను చెల్లించాలని అసెస్‌మెంట్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జీవో నంబరు 111 పరిధిలో ఫాంహౌస్ ఉందని తెలిసినా దాన్ని వేరే యంత్రాంగం పర్యవేక్షిస్తుందన్న భావనతో అప్పట్లో వారు పన్ను మాత్రమే విధించారు. ఆ మేరకు నిర్వాహకులు ఏటా ఇంటి పన్ను చెల్లిస్తున్నారు. జన్వాడ ఫాంహౌస్ పరిసర ప్రాంతాల్లో ప్రవహిస్తున్న బుల్కాపూర్ నాలా పరీవాహక ప్రాంతంలో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు గురువారం సర్వే పూర్తి చేశారు. ఉపగ్రహ చిత్రాలు, గ్రామ పటాలను సరిపోల్చారు. నాలా బఫర్‌జోన్‌లో ఫాంహౌస్ ఉందా లేదా అని నిర్ధారించుకున్నాక రంగారెడ్డి కలెక్టర్‌కు నివేదిక సమర్పించనున్నారు.

# మాట ముచ్చట పూర్తయింది... ఇక అమెరికాలో అప్పగింతలు

మొదటి పేజీ తరువాయి...

రాజ్యమేనని అన్నారు. తెలంగాణలో ప్రజల పరిస్థితి పెనం నుంచి పొయ్యి మీద పడినట్లు అయిందని చెబుతూ కెసిఆర్ వద్ద శిక్షణ పొందిన కార్యకర్తలే కాంగ్రెస్ నాయకులని ఘాటుగా వ్యాఖ్యానించారు. హైదరాబాద్ లోని నాగోల్‌లో ఉన్న ఓ కన్వెన్షన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదుపై మోర్చాలు, సెల్స్ సంయుక్త కార్యశాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌కు ఓటు వేసి పొరపాటు చేశామని ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్‌లో విలీనం ఖాయమని, త్వరలోనే అమెరికాలో అప్పగింతలు కాబోతున్నాయని బండి సంజయ్ ఆరోపించారు. అందుకే 38 మంది ఎమ్మెల్యేలున్నా బీఆర్ఎస్ రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయకుండా పరోక్షంగా కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చిందని పేర్కొన్నారు. బిజెపి కవితకు బెయిల్ ఇప్పించిందంటూ కాంగ్రెస్ ఆరోపిస్తోందని, సుప్రీంకోర్టుకు, తమ పార్టీకి ఏం సంబంధమని బండి ప్రశ్నించారు. సుప్రీంకోర్టును ధిక్కరించేలా కాంగ్రెస్ వ్యాఖ్యలు ఉన్నందునే కోర్టు హెచ్చరించిందని గుర్తు చేశారు. బిజెపి కుటుంబ, అవినీతి పాలనకు తాము వ్యతిరేకమని ఎట్టి పరిస్థితిలోనూ బీఆర్ఎస్‌తో కలువబోదని స్పష్టం చేశారు. బిఆర్ఎస్ గడీలను బద్దలు కొట్టిన చరిత్ర తమ పార్టీదేనని బండి స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వం తనపై 109 కేసులు పెట్టిందని,రెండుసార్లు జైలుకు పంపిందని గుర్తు చేసిన ఆయన కేసీఆర్ కుటుంబాన్ని వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఎన్నో అవమానాలను తట్టుకొని, దేశం కోసం, ధర్మం కోసం నిలిచిన పార్టీ బీజేపీ అని బండి సంజయ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మాట ముచ్చట అయిపోయిందని, త్వరలో కలసిపోతాయనిబండి సంజయ్ ఆయా పార్టీలకు బదులిచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎన్ని రోజులు ఇలా తప్పించుకుంటావని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బిజెపి మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ ఘాటుగా విమర్శించారు. హైడ్రా పేరుతో హడావుడి చేస్తూ హైడ్రామా చేస్తోందని ప్రభుత్వంపై ఆరోపణలు గుప్పించారు. హైడ్రా పేరుతో పేదల జోలికి వస్తానంటే అది మీ తరం కాదని, పేదల జోలికి వస్తే కబడ్దార్ అని హెచ్చరించారు. నిజంగా రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోయే పనే చేయాలంటే ముందుగా బాధితులకు ప్రత్యామ్నాయంగా ఇళ్లు నిర్మించి ఇచ్చి అప్పుడు కూల్చి వేయాలన్నారు. అంతే తప్పు ఆరు గ్యారెంటీల హామీలపై చర్చ జరగకుండా ఎన్ని రోజులు తప్పించుకుంటారో చూస్తామని హెచ్చరించారు. ఇవాళ మీరు తప్పించుకోవచ్చు కానీ ప్రజాక్షేత్రంలో మీకు శిక్ష తప్పదన్నారు. మీరు రెడ్ బుక్ రాస్తున్నానని గతంలో చెప్పావు, బీజేపీ తరపున మేము కూడా నీ చిట్టా అంతా రాసుకుంటున్నామని సందర్భం వచ్చినప్పుడు ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామని పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న సీఎం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డిపై సుప్రీంకోర్టు కామెంట్స్ చూస్తే ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఎంత బాధ్యతా రహిత్యంగా, సంస్కారహీనంగా మాట్లాడుతున్నారో అర్థమవుతున్నదని అన్నారు. ఈ ఏడాది, వచ్చే ఏడాది అన్ని స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగబోతున్నాయని పార్టీ ప్రయోజనాల దృష్ట్యా అనుభవం కలిగిన పెద్ద లీడర్లు సైతం లోకల్ బాడీ ఎన్నికల పోటీలో ఉండబోతున్నారని రాజేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ విషయాన్ని జేపీ నడ్డా, అమిత్ షా సైతం ఇదివరకే చెప్పారని అందువల్ల పార్టీ సభ్యత్వ నమోదు ప్రాముఖ్యతను అన్ని మోర్చాలు గుర్తించాలని సూచించారు.

# సుప్రీంకు రేవంత్ క్షమాపణలు

**న్యాయవ్యవస్థపై అత్యంత గౌరవం ఉందని వేడుకోలు**

**హైదరాబాద్ ఆగస్ట్ 30(నిఘా న్యూస్)** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సుప్రీం కోర్టుకు క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు సీఎం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్ విషయంలో తన కామెంట్లు న్యాయవ్యవస్థను ప్రశ్నించినట్టు ఆపాదించారని ఈ ట్వీట్‌లో వెల్లడిరచారు. వార్తాపత్రికల్లో వచ్చిన వార్తలపై బేషరతుగా విచారం వ్యక్తం చేస్తున్నట్లు వెల్లడిరచారు. భారత న్యాయవ్యవస్థపై తనకు అత్యంత విశ్వాసం ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీ మద్యం కేసులో భారాస ఎమ్మెల్సీ కవితకు మంజూరైన బెయిల్‌కు సంబంధించి ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై స్పందించిన రేవంత్.శుక్రవారం 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. 'నా వ్యాఖ్యలు న్యాయవ్యవస్థను ప్రశ్నిస్తున్నట్లుగా కొందరు ఆపాదించారు. పత్రికల్లో వచ్చిన వార్తలపై బేషరతుగా విచారం వ్యక్తం చేస్తున్నా. న్యాయవ్యవస్థ, దాని స్వతంత్రత పట్ల నాకు అపార గౌరవం, విశ్వాసం ఉన్నాయి. రాజ్యాంగం, దాని విలువలను విశ్వసించే నేను ఎన్నటికీ న్యాయవ్యవస్థను అత్యున్నతమైనదిగా భావిస్తూనే ఉంటా అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఢిల్లీ మద్యం కేసులో భారాస ఎమ్మెల్సీ కవితకు మంజూరైన బెయిల్‌కు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లు తీవ్రస్థాయిలో మండి పడ్డారు. 'ముఖ్యమంత్రి ప్రకటనలను ఈ రోజు పత్రికల్లో చదివాం. బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి చేయాల్సిన వ్యాఖ్యలేనా అవి మేం రాజకీయ పార్టీలను సంప్రదించో లేక రాజకీయాంశాల ఆధారంగానో ఉత్తర్వులిస్తామా అని ధర్మాసనం తీవ్రంగా ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ తన వ్యాఖ్యలపై తాజాగా స్పష్టతనిచ్చారు.

## బ్రహ్మంగారు నివసించిన...
# రవ్వలకొండను తవ్వేశారు

మొదటి పేజీ తరువాయి...

మొక్కలు నాటారు. ఇకపై స్మగ్లర్ల ఆటలు సాగనివ్వమని వెల్లడించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో నదులు, చెరువులు, కొండలు ధ్వంసానికి గురయ్యాయని ఏపీ సీఎం చంద్రబాబు ఆరోపించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పచ్చదనం ఆవశ్యకతను విద్యార్థులంతా గ్రహించాలని సూచించారు. మొక్కలు పెంచుతాం, చెట్లు కొట్టనివ్వం ఇదే మా విధానమని ప్రకటించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం పెరగాలని అన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంగా తీసుకెళ్తామని, భవిష్యత్‌లో విద్యుదుత్పత్తిలో కాలుష్యం ఉండబోదని తెలిపారు. పర్యావరణ సమతుల్యం కోసం అందరూ పాటుపడాలని , జీవ వైవిధ్యానికి మన రాష్ట్రం చిరునామా కావాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో పచ్చదనం 50శాతానికి పెరగాలన్నారు. తనకు ఎంతో ఇష్టమైన కార్యక్రమం వనమహోత్సవం అని చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు ఇంకుడు గుంతలు తవ్వితే చాలా మంది ఎగతాళి చేశారు. కానీ, భూగర్భ జలాలు పెరగాలంటే ఇంకుడు గుంతలు చాలా అవసరమన్నారు. పవన్ కల్యాణ్ వద్ద అటవీ, నరేగా శాఖలు ఉన్నాయి. రెండు శాఖల సాయంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలన్నారు. 'అటవీ ప్రాంతం క్రమంగా తగ్గిపోతోంది. పర్యావరణంలో పెను మార్పులు వస్తున్నాయి. భూతాపం, కాలుష్యం బాగా పెరుగుతున్నాయి. పర్యావరణ పరిరక్షణపై అందరూ అవగాహన పెంచుకోవాలి. వైకాపా హయాంలో నదులు, చెరువులు, కొండలను ధ్వంసం చేశారు. బ్రహ్మంగారు నివసించిన రవ్వలకొండను కూడా తవ్వేశారు. వైకాపా హయాంలో వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంగా తీసుకెళ్తాం. హైదరాబాద్‌లో గుట్టలు, రాళ్లు ఉన్న ప్రాంతాల్లోనే మొక్కలు నాటాం. మిషన్ హరితాంధ్రప్రదేశ్‌కు 2014లోనే శ్రీకారం చుట్టాం. డ్రోన్స్‌తో సీడ్ బాల్స్ వేసే కార్యక్రమాలు చేపడతాం. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో నగర వనాలు ఏర్పాటు చేస్తాం. జపాన్‌లోని మియావకీ విధానంలో పచ్చదనం పెంచుతాం' అని చంద్రబాబు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ వన మహోత్సవంలో కోటి మొక్కలు నాటుతామని, చెట్టు పెంచడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. ఎక్కడ ఖాళీ స్థలం ఉన్నా అక్కడ మొక్కలు పెంచాలని కోరారు. కోనసీమలో కొబ్బరి చెట్టును పెద్దకొడుకుగా చూసుకుంటారని అన్నారు. ఎకో పార్కు ప్రాంతం పర్యాటకంగానూ అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పచ్చదనం ఆవశ్యకతను విద్యార్థులంతా గ్రహించాలన్నారు. సహజ అందాలతో వచ్చే అనుభూతి ఎంతో సంతృప్తి ఇస్తుందన్నారు. చెట్లు పెంచడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. దాదాపు కోటి మొక్కలు నాటే ప్రయత్నం శాఖాపరంగా చేస్తున్నాం. ప్రస్తుతం 29 శాతం ఉన్న పచ్చదనాన్ని 50 శాతానికి తీసుకెళ్లే దిశగా కృషి చేస్తున్నాం. ఈ మహాయజ్ఞాన్ని సామాజిక బాధ్యతగా తీసుకొని ప్రతి ఒక్కరూ కలిసి రావాలి. గత ప్రభుత్వం ఇష్టారీతిన చెట్లు నరికేసింది. చెట్టుని కూల్చటం తేలిక, పెంచటం కష్టమని ప్రతి ఒక్కరూ గ్రహించాలి. ఇవాళ నాటే ప్రతి మొక్క భావితరాల కోసమే. అడవి వాతావరణం పరిరక్షించుకుంటే తప్ప భవిష్యత్తు మనుగడ లేదని పవన్ కల్యాణ్ అన్నారు. మంగళగిరి ఎయిమ్స్ వద్ద ఎకో పార్కులో ఏర్పాటు చేసిన వనమహోత్సవ కార్యక్రమంలో చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు.వేప, రావి చెట్లను నాటారు. ప్రతి ఒక్కరూ ఏటా కనీసం రెండు మొక్కలు నాటాలని పిలుపు నిచ్చారు. వనమహోత్సవం ఎంతో మహత్తరమైన కార్యక్రమమన్నారు.

## టీటీడీ తరహాలో
# యాదగిరిగుట్ట టెంపుల్ బోర్డు

మొదటి పేజీ తరువాయి...

ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆలయ అభివృద్ధిలో పెండింగ్ పనుల వివరాలు, భవిష్యత్ అవసరాల దృష్ట్యా చేపట్టాల్సిన చర్యలపై వివరాలు ఇవ్వాలని సూచించారు. ఆలయ రాజగోపురానికి బంగారు తాపడం పనులు వేగవంతం చేయాలన్నారు. ఆలయ అభివృద్ధి పనులు అర్ధాంతరంగా ఆపవద్దని స్పష్టం చేశారు. వైటీడీఏ, యాదగిరిగుట్టకు సంబంధించి పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎస్ శాంతి కుమారి, పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ రమేష్‌రెడ్డి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## ఆర్డీఓ కార్యాలయంలో వనమహోత్సవం



**శ్రీకాకుళం, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా టెక్కలిలో మొదటగా ఆర్డీఓ ఆఫీసులో ఆర్డీఓ సుదర్శన్ దొర తోనూ,కూటమి తెలుగుదేశం సభ్యులతోనూ కలసి మొక్కలు నాటే కార్యక్రమంలో జనసేనా టెక్కలి నియోజక వర్గం ఇంచార్జీ కణితి కిరణ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.డి.ఓ., టెక్కలి డి.ఎల్.పి.ఓ, టెక్కలి ఆర్డీఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్, వారి తోటి సహ ఉపాధ్యాయులతో కలసి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నాను.టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ గోవిందమ్మ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బందితో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నాను. ఈ కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గ జనసేనపార్టీ తరుపున నేరేడు, ఉసిరి, బాదం, మారేడు, రావి చెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టెక్కలి జనసేనపార్టీ నాయకులు గవరయ్య, కుమారస్వామి త్రివేణి, భాస్కర్ హరి, చందు, సోమేశ్, కోటయ్య, విశ్వనాథం, కుమార్ వంశీ,ప్రదీప్,నాగరాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహ పునః ప్రతిష్ట




**ఉప్పల్, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** ఉప్పల్ హబ్సిగూడ మార్గంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ పునః ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. శుక్రవారం జరిగిన ఆలయ పునః ప్రతిష్ట కార్యక్రమానికి ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఈఓ భాగ్యలక్ష్మి దేవాలయ ధర్మకర్తలు, చెన్ రెడ్డి రఘుపతి రెడ్డి బజారు జగన్నాథ్ గౌడ్, జనం పల్లి వెంకటేశ్వర్ రెడ్డి, లింగంపల్లి రామకృష్ణ ఈగ ఆంజనేయులు సల్ల ప్రభాకర్ రెడ్డి ఆకారపు అరుణ్, గరిక సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ గా కేశవరం



**హైదరాబాద్, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** మల్లాపూర్ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ గా మాజీ కౌన్సిలర్ కేశవరం ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కో కన్వీనర్లుగా రవి, గంగాధర్, క్రాంతికుమార్ లు నియమితులయ్యారు. నూతన కన్వీనర్ గా ఎన్నికైన కేశవరం ఆంజనేయులు మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అవసరమైన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తామని వివరించారు. అలాగే ప్రభుత్వం బోనాల పండుగకు గుడి నిర్వాహకులకు ఇస్తున్న ఆర్థిక సహాయం మాదిరిగానే కాలనీలలో ఏర్పాటు చేసే గణపతి మండపాల నిర్వాణ ఖర్చులకోసం రూ.10116 ల ఆర్థిక సహాయం అందజేసే విధంగా చర్యలు చేపడితే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. కాలనీలలో అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన గణపతి మండపాలకు మాత్రమే ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేయాలని విజ్ఞప్తి చేశారు. గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసులు సూచించే నియమ నిబంధనలు పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు విస్తరణలో...
### ఇండ్లు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయం చూపండి



**పెబ్బేరు, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** రోడ్డు విస్తరణలో ఇండ్లు కోల్పోయిన వారికి ప్లాట్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చి న్యాయం చేయాలని ఇళ్లు కోల్పోయిన బాధితులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఆదిశేషు, మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రె స్వామికి మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ మేము గత ప్రభుత్వంలో రోడ్డు విస్తరణలో భాగంగా విలువైన ఇండ్లను, ప్లాట్లను పోగొట్టుకున్నామని, గత ప్రభుత్వం మాకు ఇండ్లు ప్లాట్లు ఇస్తామని హామీ ఇచ్చి ఇవ్వలేదని, ఇప్పటికైనా మాపై దయ ఉంచి రోడ్డు విస్తరణలో భాగంగా ఇండ్లు ప్లాట్లు పోయిన బాధితులకు ఇళ్ల స్థలాలు, ఇల్లు కట్టించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధితులు జి.ఎల్లన్న గౌడ్,స్వామి,శ్యామ్ లాల్,కృష్ణాజి, సహదేవుడు, రాముడు, సదామణి, జనార్దన్ గౌడ్, భారతి తదితరులు పాల్గొన్నారు.

# భూపతి పాలెంలో ఘనంగా వనమహోత్సవం

### మొక్కలు నాటిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**గోకవరం, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** గోకవరం మండలం భూపతిపాలెం గురుకుల పాఠశాల ఆవరణలో ప్రభుత్వ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమానికి జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ హాజరై మొక్కలు నాటి వనమహోత్సవం ప్రారంభించారు. ముందుగా పిల్లలందరితో నాయకులతో వనమహోత్సవం ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గురుకుల పాఠశాలలోని తరగతి గదులు, హాస్టల్, వంటశాలలు, పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎంతో ప్రతిష్టాత్మంగా ఈరోజు వనమహోత్సవం హరితాంధ్రప్రదేశ్ స్థాపనే ధ్యేయంగా ఈ కార్యక్రమం తీసుకున్నారని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. 150 కొబ్బరి మొక్కలు 50 రకాల వివిధ పళ్ళ మొక్కలు నాటడం జరుగుతుందని దీనిపై ఏపీవో శ్రద్ధ తీసుకుని ఐదు నెలల కాలం పరిరక్షించాలని కోరగా ఏపీవో అప్పలరాజు రెండు సంవత్సరాలు ఈ మొక్కల పరిరక్షణ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో తీసుకుంటామని తెలియజేశారు. ప్రతి నాయకుడు, ప్రతి విద్యార్థి, ప్రతి ఒక్కరూ కూడా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని అందులో భాగంగా తమ ఇంటి వద్ద ప్రతి ఒక్కరు ఈరోజు మొక్క నాటి తనకు ఫోటో పెట్టాలని కోరారు. గురుకుల పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులు అంచెలంచెలుగా ఏర్పాటు చేసుకుంటూ వెళ్తానని విద్యార్థులు అందరూ శ్రద్ధగా చదువుకుని మీ బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి ఎస్ అప్పలరాజు, అడపా భరత్ బాబు, ఘాజింగం సత్తిబాబు, జడ్పిటిసి దాసరి రమేష్, దాసరి తమ్మన్న దొర, మంగ రౌతు రామకృష్ణ, స్కూల్ చైర్మన్ గల్లా రామచంద్రరావు, వైస్ చైర్మన్ రాజీవ్, సర్పంచులు అడపా వెంకట్రావు, విడుదల అర్జున్ రావు, కమ్మెలవెంకటేశ్వరరావు, దాసరి సీతారామకృష్ణ, ఎమ్మార్వో, ఎంపీడీవో, ఎంఎస్ఓ, ఏపీవో పిఎస్ అప్పలరాజు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, గురుకుల పాఠశాల విద్యా కమిటీ పాలకవర్గం తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గుబ్బాలమ్మ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



**గోకవరం, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** గోకవరం గ్రామ దేవత శ్రీ గుబ్బాలమ్మ అమ్మవారి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ గా ఆచంట రాజు ప్రమాణ స్వీకారం చేశారు. సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ శ్రీ గుబ్బాలమ్మ అమ్మవారు మా ఇంటి ఇలవేల్పని స్వగ్రామంలో పూర్వం నుండి కూడా దళిత యువకుడిచే ప్రతిరోజు అమ్మవారు పూజలు అందుకుంటుందని ఆయన తెలిపారు. అదేవిధంగా గోకవరంలో త్వరలో అన్న క్యాంటీన్ వృద్ధాశ్రమం తీసుకురావడం జరుగుతుందని ఆయన తెలిపారు. దేవుని సొమ్ముతో ఎవరూ చెలగాటమాడవద్దని కమిటీ సభ్యులకు ఆయన హితవు పలికారు. టిడిపి మండల కన్వీనర్ మంగరౌతు రామకృష్ణ ఆధ్వర్యంలో కార్యవర్గంలో భాగంగా వైస్ చైర్మన్ గంగ్రెడ్డి సన్యాసిరావు,వైస్ చైర్మన్ సుంకర నరేంద్ర, వైస్ చైర్మన్ ముప్పిడి నాగేశ్వరరావు, సెక్రటరీ అలమండ శివాజీ, ట్రెజరర్ ముమ్మిడివరపు నారాయణరావు, సబ్ ట్రెజరర్ గున్నూరి లాజర్, సబ్ ట్రెజరర్ నేతల నరేంద్ర, డైరెక్టర్లుగా మంగరాతి పెద్దరాజు, చవాకుల రాంబాబు, ఎలుగబంటి అబ్బులు, పొట్నూరి సన్యాసిరావు, పీత శ్రీను, వెన్ను వీరబాబు, జక్కల చిన్ని,బొడ్డు రాజు, రేవాడ అర్జున్,వల్లూరి ప్రసాద్ రావు,బండి మణి, అరిగెల బాలరాజు, మైపాల గణేష్, గొంగటి కోటేశ్వరరావు,, మామిడి సత్యనారాయణ, పిల్లా సత్య నారాయణ, కరిబండి వెంకటేశ్వరరావు, గుబ్బల ప్రసాద్, బీమవరపు రాఘవ, కర్రి శివ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# భక్తులకు కనక దుర్గమ్మ వారి తీర్థ ప్రసాదాలు

### విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల



**గోకవరం, ఆగస్టు 30 (నిఘ న్యూస్):** గత కొన్నేళ్ళుగా స్థానిక దేవి చౌక్ శ్రీ కనక దుర్గమ్మ ఆలయంలో 50 కేజీల పులిహోర, డ్రైవర్ కాలనీ శ్రీ కనక దుర్గ అమ్మ వారి ఆలయం అలాగే గాదెలపాలెం గ్రామంలో వెలిసిన శ్రీ కనక దుర్గమ్మ అమ్మ వారి ఆలయం, దేవీపట్నం మండలం ఇందుకూరుపేట గ్రామంలోని శ్రీ కనక దుర్గమ్మ ఆలయంలో పులిహోర ప్రసాదాన్ని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి, అనంతరం భక్తులకు వితరణ చేస్తున్నట్లు విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు తెలిపారు. ఆయా గ్రామాల భక్తులందరూ అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కంబాల శ్రీనివాసరావు కోరారు. అమ్మవారి చల్లని ఆశీస్సులతో వారం వారం ఈ కార్యక్రమాలు జరుపుతూనే ఉంటానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్న దొర, వరసాల ప్రసాద్, డా వల్లూరి జగన్నాధ రావు శర్మ, దేవి చౌక్ సేవకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# గోకవరం డిపో ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన



**గోకవరం, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో గోకవరం డిపో గేటు వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జీవో నెంబర్ 114 లోని అలవెన్స అమలు చేయాలని, పి టి డి రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యూటీ అర్జిత సెలవులు బకాయిలు వెంటనే చెల్లించాలని, అలాగే చనిపోయిన కార్మిక ఉద్యోగుల అంత్యక్రియలు నిమిత్తం ఖర్చు 25 వేల రూపాయలు ట్రెజరీ ద్వారా చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఉద్యోగులకు ఏ ఏ ఎస్ ఇంక్రిమెంట్లు ఇంక్రిమెంట్ ఏరియల్ ఇప్పించాలని అలాగే రీఎంబర్స్మెంట్ బిల్లులు ఇప్పించాలని మెడికల్ రియంబర్స్మెంట్ బిల్లులు ఇప్పించాలని ఏపీ జి ఐ ఎల్ బిల్లులు చెల్లించాలని నినాదాలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమములో ఎన్ఎంయు అసోసియేషన్ రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.చంద్రరావు ఆధ్వర్యంలో గోకవరం ఆర్టీసీ డిపో సెక్రటరీ ఎంఎంఎస్, డిపో ప్రెసిడెంట్ వివివి శ్రీనివాస్ సమక్షంలో సుమారు 20 మంది ఎంప్లాయిస్ డిపో గేటు వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

# చిరు వ్యాపారుల పుట్టగొట్టకండి

- ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన ఉప్పల్ భగాయత్ ప్రతినిధులు



**ఉప్పల్, ఆగస్టు 30(నిఘా న్యూస్):** ఉప్పల్ భగాయత్ హెచ్ఎండిఏ లే అవుట్ లో పలు చిన్న చిన్న వ్యాపారస్తుల తాత్కాలిక నిర్మాణాలను కూల్చివేస్తున్న సందర్భంగా ప్రభుత్వ నిబంధన జీవో నెంబర్ 33 ప్రకారం కూల్చివేతలపై పునః పరిశీలించాలని జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ను కలిసిన ఉప్పల్ భగాయత్ అసోసియేషన్ సభ్యులు కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు ఉప్పల్ భగయత్‌లో హెచ్ఎండిఏ రైతుల దగ్గర నుంచి పొలాలు సేకరించి లేఔట్ గా అభివృద్ధి చేసి రైతులకు కొన్ని ప్లాట్లు కేటాయించడం జరిగిందన్నారు. వారికి ఆ ప్లాట్ లలో ఇప్పుడే శాశ్వత నిర్మాణాలు చేసుకోవడం కుదరకపోవడంతో కొంతమంది జీవనోపాధి కోసం ఆ ప్లాట్ లలో తాత్కాలిక నిర్మాణాలు చేపట్టి వాటిలో బేకరీ, స్వీట్ హౌస్, రెస్టారెంట్, హోటల్స్, లాంటి చిన్నచిన్న వ్యాపారాలు చేసుకోవడం జరుగుతుందని వెల్లడించారు. ఇలా జరుగుతున్న సందర్భంలో ఈ మధ్య జిహెచ్ఎంసి వారు చిన్నచిన్న వ్యాపారస్తుల తాత్కాలిక నిర్మాణాలను (షెడ్లను) కూలగొట్టడం జరుగుతుంది. కావున జీవో నెంబర్ 33 ప్రకారం గృహ నిర్మాణ స్థలాల్లో తాత్కాలిక నిర్మాణాలు చేసుకుని చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పించాలని దీనిపై పున:పరిశీలించాలని జెడ్ సి ని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కన్వీనర్ మేకల మధుసూదన్ రెడ్డి, ఒక్కంటి శ్రీనివాసరావు, బంగ్లా శ్రీనివాస్ రెడ్డి, గుమ్మిడేల్లి శ్రీనివాస్, బుసిరెడ్డి కృష్ణారెడ్డి, గుమ్మిడేల్లి వెంకటేష్, అజయ్, నరేంద్ర చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ క్రీడల దినోత్సవం



**నారాయణఖేడ్, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** నిజాంపేట లోని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయ క్రీడ దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి, ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు చదువుతోపాటు అప్పుడప్పుడు క్రీడలను కూడా ప్రోత్సహించాలి. అలాగే పాఠశాలలో ఉపాధ్యాయుని కూడా విద్యార్థులకు క్రీడల గొప్పతనం గురించి చెప్పాలి. ఎమ్మెల్యే మాట్లాడుతూ ధ్యాన్ చాంద్ ని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలి అన్నారు. క్రీడల వలన మీ ఆరోగ్యం మంచిగా ఉంటుంది. జ్ఞాపక శక్తి కూడా పెరుగుతుంది. కావున విద్య తో పాటు ఆటలను కూడా ఆడాలని ఎమ్మెల్యే అన్నారు. చివరకి టాస్ ఎగరవేసి వాలీ బాల్ ఎగరవేసి ప్రారంభించిన ఎమ్మెల్యే. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు, వారితో పాటు, మండల నాయకులు శంకర్ గౌడ్,రాధ కిషన్ సెట్, మల్లేష్, లింగ రెడ్డి, కృష్ణ మాజీ ఎంపీటీసీ శ్రీకాంత్ నిజాంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం ముందు అందరు సమానులే

- సమన్యాయం అందించడమే న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యం
- జిల్లా న్యాయ శాఖ సేవాధికార సంస్థ, కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు



**శ్రీకాకుళం, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రన్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు సీనియర్ సివిల్ జడ్జి కార్యదర్శి జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ ఆర్.సన్యాసి నాయుడు ఆర్.సి.ఎం.జూనియర్ కళాశాల న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల నందు రాజ్యాంగం విధి విధానాల గూర్చి వివరించారు. ఆస్తి హక్కుల గురించి,బాల్య వివాహాల చట్టం దీని వలన జరుగు ప్రమాదాల గూర్చి వివరించారు.ఆర్థిక స్తోమత లేని వారికి న్యాయ సేవాధికార సంస్థ వారు ఎటువంటి రుసుము తీసుకోకుండా న్యాయ వాదులను నియమించి, వారి తరుపున వాదించడంలో న్యాయ సేవా ఆధికార సంస్థ అద్భుతంగా పనిచేస్తుందని తెలిపారు. సమాజంలో తలెత్తుతున్న ఆవరోధాల నుండి జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. భవిషత్తులో ఉన్నత శిఖరాలను ఆవరోధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జి.ఇందిరా ప్రసాద్, ప్యానెల్ అడ్వకేట్ శశికళ కరెస్పాండన్స్ యం.శాంతి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాకాల సిఐగా కె.మద్దయ్య ఆచారి



**చంద్రగిరి, ఆగస్ట్ 30 (నిఘా న్యూస్):** పాకాల మండలం పాకాల పోలీస్ స్టేషన్ లో పాకాల సిఐగా కె.మద్దయ్య ఆచారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.పాకాల ఎస్.ఐలు మహేష్ బాబు,లోకేష్ కుమార్,సిబ్బంది కలిసి పాకాల సిఐకి పుష్పగిచం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాకాల సిఐ కె.మద్దయ్య ఆచారి మాట్లాడుతూ పాకాల సిఐ గా బాధ్యతలు చేపట్టడం జరిగిందని తెలిపారు. పాకాల పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు నా వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.చట్టం దృష్టిలో అందరూ సమానులేనని, ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

### చౌటుప్పల్ ట్రాఫిక్ ఎస్ఐ యాదయ్య



**వలిగొండ, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ కేంద్రంలో వాహన చోదకులు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని చౌటుప్పల్ ట్రాఫిక్ ఎస్ఐ యాదయ్య అన్నారు. శుక్రవారం తనిఖీలో భాగంగా వలిగొండ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా లో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెంబర్ ప్లేట్ లేకుండా, లైసెన్స్ లేకుండా హెల్మెట్ లేకుండా వాహనాలు నడపొద్దని, నెంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపితే నేరస్తులు అవుతారని అన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులే శిక్షారులవుతారని, తమ పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రాణాలతో చెలగాటం ఆడ వద్దని హెచ్చరించారు. ఈ తనిఖీలు ఎస్సైలు ఇద్దయ్య, సత్యనారాయణ, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# రాజదండం స్థానంలో రాజ్యాంగం కోసం ఉద్యమం

### డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్




**నారాయణఖేడ్, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజ్యాంగ వ్యతిరేక పాలన సాగిస్తోందని దళిత హక్కుల పోరాట సమితి (డి హెచ్ పి ఎస్ ) సంగారెడ్డి జిల్లా కౌనిల్స్ సమావేశం ఆనందం అధ్యక్షతన అంబేద్కర్ భవన్ లో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగ మౌలిక సూత్రాలన్నింటినీ నిర్వీర్యం చేసి దేశంలో చక్రవర్తి తరహా పాలన తీసుకు రావటానికి ప్రయత్నిస్తుందని ధ్వజమెత్తారు. దానిలో భాగంగానే పార్లమెంట్లో రాచరిక వ్యవస్థకు చిహ్నం అయిన రాజదండం (సెంగోల్) ప్రతిష్ఠాపన చేసిందన్నారు. రాజదండం తొలగించి రాజ్యాంగం ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. గత పదేళు గా మోదీ ప్రభుత్వం అంబేద్కర్ ప్రసాదించిన పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి రాజ్యాంగ వ్యతిరేకంగా పాలన చేస్తూ ప్రజల హక్కులను, స్వేచ్ఛను కాలరాచి చక్రవర్తి తరహా పాలన తీసుకురావాలని కుట్ర చేస్తుందని మండిపడ్డారు. సంఘ్ పరివార్ సిద్ధాంతమైన మనుధర్మ శాస్త్రాన్ని జనబాహుళ్యంలోకి విస్తృతంగా వ్యాప్తి చేసి సమాన హక్కులకు, సామాజిక న్యాయానికి తూట్లు పొడిచి మధ్యయుగాల నాటి మనుధర్మ రాజ్యాంగాన్ని అమలు చేయాలన్న కుట్రలో భాగంగానే పార్లమెంట్ లో ప్రతిష్ఠించిన రాజదండమే నిదర్శనమని అన్నారు. దేశ ప్రజలను బానిసత్వంలోకి నెట్టి రాజ్యాధికారాన్ని చలాయించడానికి పెట్టుబడిదారులు, ఫ్యూడల్ శక్తులు, కుయుక్తులు పన్నుతున్నారన్నారు. అదాని, అంబానీ సంపద పెరగడమే అభివృద్ధి అని గుడులు గోపురాలు కట్టడమే అభ్యుదయమని ప్రజల మెదడులలో విష బీజాలు నాటుతున్న మోదీ ప్రభుత్వ అరాచకాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రజలను చైతన్యవంతం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి మతతత్వ, కులతత్వ, ప్రాంతీయ అసమానతలతో పరిపాలన కొనసాగుతోందనడానికి నిదర్శనమే పార్లమెంట్ లో రాజదండం ప్రతిష్టాపన అన్నారు. ఈ సమావేశంలో ఆనంద్ గణపతి అశోక్ ఆనంద్ రాము చిరంజీవి ప్రశాంత్ సామాజిక కార్యకర్త కొరారి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే సాయం



**పెబ్బేరు, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** పెబ్బేరు మున్సిపాలిటీ కి చెందిన గంధం బాలస్వామి, చెలిమిళ్ళ గ్రామానికి చెందిన గాడిమూడి పెంటమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మేఘారెడ్డికి విషయం తెలియజేయగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి మృతుల కుటుంబాలకు గంధం రాజశేఖర్, మాజీ డైరెక్టర్ రాములు కాంగ్రెస్ నాయకులతో కలిసి అందజేశారు. మృతుల కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఇంచార్జి వినయ్, గంధం పాండు,గాంధీ కాలనీ పెద్దలు బుచ్చన్న, భారన్న, పెంటన్న, గోవిందు, రాముడు,రాజా గౌడ్, మాసన్న, సలీమ్, రాములు, జనార్దన్ గౌడ్, బి.కృష్ణయ్య, పరుశరాములు, చిన్నరాములు, రాములు, ఆంజనేయులు, మల్లెపల్లె భగవంతు తదితరులు పాల్గొన్నారు.

## అండర్ 14.. వాలీబాల్ లో జడ్పీహెచ్ఎస్ విద్యార్థుల విజయం



**తూప్రాన్, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** తూప్రాన్ తెలంగాణ గురుకుల పాఠశాలలో గురువారం నుండి ప్రారంభమైన క్రీడల్లో భాగంగా అండర్ 14 లో రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులతో పాటు జడ్పీహెచ్ఎస్ తూప్రాన్ విద్యార్థులు ఇరు జట్లు వాలీబాల్ లో తలపడగా జెడ్పీహెచ్ఎస్ తూప్రాన్ టీం ఫైనల్లో విజయం సాధించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫైనల్ లో విజయం సాధించిన వాలీబాల్ జట్టు విద్యార్థులను అభినందించారు. అనంతరం జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సంస్థ చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిఎంఆర్ సంస్థ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, డాక్టర్ పార్వతి సత్యనారాయణ, పిడి.రమేష్, పిడి.బాలరాజు ఉపాధ్యాయుడు ప్రవీణ్, సంజీవులు, సంగమేశ్వర్, కాంతమ్మ, రజియా తదితరులు పాల్గొన్నారు.

## నేడు రక్తదాన శిబిరం



**కోరుకొండ, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ జ జన్మదిన మహోత్సవాన్ని పురస్కరించుకొని సేవ కార్యక్రమాల్లో భాగంగా అనుకొని ప్రమాదాలు, ఇతర కారణాలతో రక్తం లేక ఇబ్బంది పడే వారిని ఆదుకోవాలనే మహా సంకల్పంతో ఈనెల 31న అనగా (శనివారం) రాజానగరం మండలం, రాజానగరం రాయల్ కన్వెన్షన్ హాల్లోఉదయం 10 గంటల నుండి రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేయడం జరిగింది. కావున ఎన్ డి ఏ కూటమి (జనసేన, తెలుగుదేశం, బిజెపి) నాయకులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు ఈ మెగా రక్తదాన శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

## వెంకటస్వామికి సురభి స్మారక పురస్కారం



**బొగ్గులకుంట, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** ప్రముఖ మేకప్ ఆర్టిస్ట్ బాపనపల్లి వెంకటస్వామి రంగస్థల లెజెండరీ నటీమణి దివంగత సురభి జమునా రాయలు స్మారక పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ బొగ్గుల కుంటలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి,పూర్వ ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి, కళా బంధు సారిపల్లి కొండలరావు, సినీ మాటల రచయిత బుర్ర సాయి మాధవ్, యువకళావాహిని లంక లక్ష్మీ నారాయణ, సీనియర్ రంగస్థల నటుడు డాక్టర్ అక్కిరాజు సుందర రామకృష్ణ లు ముఖ్య అతిథులుగా పాల్గొని బాపనపల్లి వెంకటస్వామికి సురభి జమునారాయలు స్మారక పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ తనను ఈ అవార్డుకు ఎంపిక చేసిన సురభిరాయలు, సురభి యామిని, నిఖిలేష్ లకు ధన్యవాదాలు తెలిపారు.

## నేడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ



**శ్రీకాకుళం, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** ఎన్.టీ.ఆర్.పెన్షన్ భరోసా పథకంను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేతుల మీదుగా నేటి ఉదయం తొమ్మిది గంటలకు టెక్కలి మండలం రావివలస గ్రామంలో జరుగుతుందని మంత్రి క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అనంతరం రావివలస గ్రామంలో సచివాలయం, రైతు సేవ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాలను ప్రారంభించటం జరుగుతుందని తెలిపారు. పెన్షన్ లబ్ధిదారులు అందరూ సకాలంలో వచ్చి పెన్షన్లు అందుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, కూటమి పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# అంగన్వాడి కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

### అంగన్వాడి కేంద్రాల అప్ గ్రేడేషన్ పనులు నాణ్యత తో చేపట్టాలి



**పాలకుర్తి, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** పాలకుర్తి మండలం లో వివిధ గ్రామాలలో శుక్రవారం అంగన్వాడి అప్ గ్రేడేషన్ పనులను అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ స్వయంగా సందర్శించి పరిశీలించారు. పనులను నాణ్యతతో చేపట్టాలని అధికారులకు సూచించారు. పాలకుర్తి గ్రామపంచాయతీ లో ఫ్రైడే సందర్భంగా డ్రై డే కార్యక్రమం అమలు తీరును మండల స్థాయి అధికారులతో కలిసి సందర్శించి పరిశీలించారు. పరిసరాల్లో చెత్త చెదారం ఎప్పటికప్పుడు తొలగించాలని, లోతట్టు ప్రాంతాలలో నీరు నిలవకుండా చదును చేయాలన్నారు. గ్రామాలలోని పరిసరాలలో ఇండ్లలోను దోమలు గుడ్లు పెట్టకుండా టైర్లు, పాత వస్తువులు,కూలర్లు,కొబ్బరి బోండాలు వంటివి తొలగించాలని నిల్వ ఉన్న నీటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రతి శుక్రవారం చేపడుతున్న డ్రై డే కార్యక్రమ ఉపయోగాన్ని ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించాలని కోరారు. అలాగే విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. దోమ లార్వా పెరగకుండా మురుగు కాలవల్లో ఆయిల్ బాల్స్ వేయించాలని అధికారులకు సూచించారు. గ్రామంలో దోమలను పారద్రోలేందుకు ఫాగింగ్ చేపట్టాలన్నారు. అనంతరం కొడకండ్ల మండలం మొండ్రాయి గ్రామంలో పర్యటించి అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. పనులు త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ వెంట జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి జయంతి, పాలకుర్తి ఎంపీడీవో రాములు ఏఈ శ్రీనివాస్ పంచాయతీ రాజ్ ఇంజనీర్ శ్రీనివాస్, పాలకుర్తి సెక్రటరీ వెంకటాచారి, అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం



**వెల్దుర్తి, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** వెల్దుర్తి మండల కేంద్రంలో మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిఎంఆర్ హాస్పటల్ వారి సహకారంతో ముఖ్య అతిథులుగా జిఎంఆర్ హైవేస్ ప్రాజెక్టు మేనేజర్ జె.వెంకటరమణ జిఎంఆర్ హైవేస్ మేనేజర్ లక్ష్మణ్ రావు, జిఎంఆర్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్ ప్రారంభించారు. సిఎంఆర్ హాస్పిటల్ వైద్య బృందం డాక్టర్ నిహారిక డాక్టర్ శివ డాక్టర్ వెంకట్ లు 245 మంది విద్యార్థులను పరీక్షించి అనారోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించి వారికి తగిన మందులను ఉచితంగా ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సీజనల్ జ్వరాలు, అలెర్జీలు, తలనొప్పి రక్తహీనత, చర్మ సంబంధించిన సమస్యలను విద్యార్థులలో ముందుగానే గుర్తించి అనారోగ్య సమస్యలను నయం చేయడానికి శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరం అనంతరము సమావేశం ఏర్పాటు చేసి చేతుల పరిశుభ్రత గురించి, మంచి పోషకాహారం తీసుకోవడం వల్ల వ్యాధులకు దూరంగా ఉండవచ్చని, చాలామంది విద్యార్థినులు రక్తహీనతతో బాధ పడుతుంటారని ఈసమస్య నుంచి దూరంగా ఉండడానికి ఎటువంటి ఆహారం తీసుకోవాలో తెలపడం జరిగింది, చర్మ వ్యాధులతో ఎక్కువగా హాస్టల్లో ఉండే విద్యార్థులు బాధపడు తుంటారు. ఇందుకుగాను చేతులు ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్లందరూ విద్యార్థులందరికీ అవగాహన కల్పించడం జరిగింది. పాఠశాల ఉపాధ్యాయ బృందం, సరైన సమయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసిన జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సీఎంఆర్ హాస్పిటల్స్ వైద్య బృందాన్ని అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఎంఆర్ హాస్పిటల్స్ కో-ఆర్డినేటర్ రాజ్ నారాయణ, వైద్య నిపుణులు నిహారిక, శివ, వెంకట్, జిఎంఆర్ హైవే ప్రాజెక్టు మేనేజర్ జె వెంకటరమణ, జిఎంఆర్ హైవేస్ మేనేజర్ లక్ష్మణ్ రావు, జి.యం.ఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్ కూడిపుడి, ప్రిన్సిపాల్ వందన, ఏటీపీ. గౌసియా, హెల్త్ సూపర్వైజర్ స్రవంతి, పిఈటి వెన్నెల విద్యార్థినిలు పాల్గొన్నారు.

# అసంఘటిత కార్మికులకు.. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


- సెప్టెంబరు, 1,2,3 తేదీలలో విశాఖలో ఏఐటియుసి జాతీయ సమావేశాలు



**శ్రీకాకుళం, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** అసంఘటిత రంగంలో పని చేస్తున్న సివిల్ సప్లైయిస్, హమాలీ, ముఠా కార్మికులు, ఆటో,ట్యాక్సీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని ఏఐటియుసి శ్రీకాకుళం జిల్లా సమితి డిమాండ్ చేసింది.శ్రీకాకుళం పాత బస్టాండ్ పొట్టి శ్రీరాములు మార్కెట్ యార్డు వద్ద జాతీయ సమితి సమావేశాలు గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆ సంఘం జిల్లా కార్యదర్శి అనపాన షణ్ముఖ రావు,జిల్లా నాయకులు తమిరి తిరుపతి రావు,చిక్కాల గోవిందరావు మాట్లాడుతూ 1920 నుండి సంఘటిత,అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలపై ఏ.ఐ.టి.యు.సి. పని చేస్తుందని అన్నారు.నలభై నాలుగు కార్మిక చట్టాలను పోరాడి సాధించుకోవడం జరిగిందని అన్నారు. ప్రభుత్వాలు కార్మికులకు మెరుగైన సౌకర్యాలు అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.కార్మికుల సమస్యలపై సుధీర్ఘ పోరాటాలు చేసిన ఘనత ఉందన్నారు.అసంఘటిత రంగంలో పని చేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సహజ మరణం పొందిన కార్మికులకు ఐదు లక్షలు, ప్రమాద మరణం,అంగ వైకల్యం పొందిన కార్మిక కుటుంబాలకు లక్ష రూపాయల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ.ఎస్.ఐ.పి.ఎఫ్.సౌకర్యాలతో పాటు పిల్లల చదువులకు స్కాలర్ షిప్పులు,ఆడ పిల్లల వివాహానికి లక్ష రూపాయల ఆర్థిక ప్రోత్సాహం అందించాలని కోరారు.కార్మికుల సమస్యలపై పోరాడుతున్న సంఘం జాతీయ సమితి సమావేశాలు సెప్టెంబరు1,2,3 తేదీలలో విశాఖలో జరుగుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు అత్యధికంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జట్టు కళాసీలు నాయకులు లబ్బ రాజు,నక్క వేణు, గొండు శ్రీను, ముద్దాడ రాము, దాలి నాయుడు,లండ తాతారావు, రాము, జగదీశ్, అప్పారావు, సత్యం, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉప్పాడ సూర్యనారాయణ,ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు చుక్క రాము తదితరులు పాల్గొన్నారు.

# అంతా నా ఇష్టం అంటున్న వ్యవసాయ శాఖ

### రైతులను ఇబ్బందులు పెడుతున్న అధికారులు





**లోకేశ్వరం, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** మండల కేంద్రంలోని ఆయా క్లస్టర్ లలో కాకుండా ఎక్కడో కూర్చుని వ్యవసాయ అధికారులు రైతులకు ఇబ్బందులు పెడుతున్నారు. మొన్నటి వరకు రేషన్ కార్డు లేని రైతులకు రెండు లక్షల రూపు రుణాలు తీసుకున్న రైతుల దగ్గర నుండి పత్రాలు తీసుకున్నారు.మళ్ళీ కొత్త రూల్స్ అంటూ సెల్ఫీ దిగి యాప్ లో అప్లై చేయాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.అయితే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రుణమాఫీ కాలేదని ఫిర్యాదు వేసిన వారి ఇళ్లకు వ్యవసాయ అధికారులు వెళ్తారని చెప్పారు కానీ లోకేశ్వరం లో మాత్రం ప్రతి ఒక్క రైతు వ్యవసాయ అధికారి దగ్గరికి వెళ్లి రుణమాఫీ కానీ రైతులు తమ పత్రాలను వ్యవసాయ అధికారికి ఇవ్వాలని లోకేశ్వరం ప్రత్యేక వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు. ప్రభుత్వం చెప్పేది ఒకటి,లోకేశ్వరం వ్యవసాయ శాఖ అధికారి చెప్పేది ఒకటి ఇలా చెప్పడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ప్రత్యేక అధికారిపై లోకేశ్వరం రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.రైతులకు ఏదైనా సమాచారం ఇవ్వాలంటే వాట్సాప్ గ్రూపులలో మెసేజ్ చేస్తున్నారు.అంతే మిగతా రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు రైతులు చదువుకోలేదు రైతుల దగ్గర పెద్ద ఫోన్ లేకపోవడం వల్ల వ్యవసాయ అధికారులు సమాచారం రైతులకు తెలవడం లేదని శుక్రవారం వ్యవసాయ అధికారులకు రైతులకు మధ్య ఆందోళన జరిగింది ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలను ప్రతి ఒక్కరైతుకు చేరే విధంగా దప్పు చాటింపు ఇవ్వాలని రుణమాఫీ కానీ రైతుల ఇంటి దగ్గరికి వెళ్లి సర్వే చేయాలని లోకేశ్వరం మండల రైతులు కోరుకుంటున్నారు. రైతుల ఇంటికి వెళ్లి సర్వే చేయకుంటే పై అధికారులకు కంప్లీట్ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక అధికారి వివరణ: రేషన్ కార్డు లేని, రుణమాఫీ కానీ రైతులు ఇంటింటికి సర్వే చేసేది లేదని రైతులే రైతు వేదికకు వచ్చి తమ పత్రాలను ఇచ్చి సెల్ఫీ దిగి వెళ్లాలని తెలిపారు.

## మలక్ పేటలో ఎమ్మెల్యే పర్యటన



**మలక్‌పేట్, ఆగస్ట్ 30 (నిఘా న్యూస్):** ప్రజల సమస్యల పరిష్కరించేందుకు మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామని మలక్ పేట్ ఎమ్మెల్యే అహ్మద్ భీమ్ అబ్దుల్లా బలాల అన్నారు. శుక్రవారం ఓల్డ్ మలక్ పేట్ డివిజన్ పరిధిలోని పలుబస్తీ ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. త్వరలోనే రోడ్డు, డ్రైనేజీ పనులను చేపట్టి త్వరలోనే పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షఫీ యుద్దీన్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు...

## స్పెషల్ ఆఫీసర్ల నియామకం



**విశాఖపట్నం, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** విశాఖ అనకాపల్లి అల్లూరు జిల్లాలకు సీనియర్ ఐఏఎస్ అధికారులను స్పెషల్ ఆఫీసర్స్ గా రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం నియమించింది. విశాఖ జిల్లాకు హైయర్ ఎడ్యుకేషన్ కార్యదర్శి సౌరబ్ గౌర్ ను గవర్నమెంట్ నియమించింది. అల్లూరి జిల్లాకు సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి కే.కన్నబాబు అనకాపల్లి కి ఇండస్ట్రీస్ డైరెక్టర్ సీ హెచ్ శ్రీధర్ ను నియమించింది.




మేడ్చల్ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియచేసిన బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, కార్పొరేటర్లు కొత్త చందర్ గౌడ్, బింగి జంగయ్య యాదవ్, సుమన్ నాయక్, పద్మా రెడ్డి వెంకటేష్ గౌడ్, జంగా రెడ్డి, కిషోర్ గౌడ్, కృపా సాగర్ తదితరులు పాల్గొన్నారు.

*-పీర్జాదిగూడ, ఆగస్టు 30 (నిఘా న్యూస్):*

## వెలగని వీధి దీపాలు ఇబ్బందుల్లో ప్రజలు

### అంతా మా ఇష్టం అంటున్న గ్రామపంచాయతీ సిబ్బంది





**లోకేశ్వరం, ఆగష్టు 30 (నిఘా న్యూస్):** మండలం కనకపూర్ గ్రామంలోని ఆయా కాలనీల్లో గత కొన్ని రోజుల నుంచి విద్యుత్ విధి దీపాలు వెలగడం లేదు. వీధి దీపాలు వెలగక పోవడంతో రాత్రి సమయంలో బయటకు రావాలంటే భయంగా ఉందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఒకరోజు వస్తున్నాయి రెండో రోజు రావడం లేదు.నిర్లక్ష్యంగా గ్రామపంచాయతీ సిబ్బంది ఎన్నిసార్లు విన్నవించిన పట్టింపు లేని అధికారులు ఇకనైనా పై సంబంధిత అధికారులు స్పందించి విది దీపాలు వెలిగేలా చెత్త సేకరణ పారిశుద్ధ్య పనులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరారు.



పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ నూతన మేయర్ గా ఎన్నికై బాధ్యతలు స్వీకరించిన యువ నేత అమర్ సింగ్ ను మర్యాద పూర్వకముగా కలిసి మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, పి ఎం సి కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు శ్రీలత నాయక్, నందిత గౌడ్ మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి,శారద గౌడ్ మహిళా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, అంజమ్మ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

–పీర్జాదిగూడ, ఆగస్టు 30 (నిఘా న్యూస్):

## యాద్గార్ పల్లిలో ఓక్ హుడ్ ఫామ్ హౌస్ సీజ్



**కీసర, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** యాద్గార్ పల్లి గ్రామం పరిధిలో ఓక్ హుడ్ ఫామ్ హౌస్ నందు స్విమ్మింగ్ పూల్ లో పడి రాగిడి సందీప్ రెడ్డి (29) సంవత్సరాలు, వృత్తి ప్రైవేట్ జాబ్ చేస్తూ నివాసం కాప్రా పరిధిలోని ఎల్లారెడ్డి గూడలో నివసిస్తున్నాడు. తన సొంత గ్రామం పెద్దపల్లి జిల్లా లోని ఓదెల్లి మండలం, కుంట గ్రామం నివాసి. స్విమ్మింగ్ పూల్ లో మునిగి చనిపోగా రాగిడి దిలీప్ రెడ్డి ఫిర్యాదు మేరకు శుక్రవారం కీసర పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేయడంతో ఈ విషయంలో కీసర ఆర్ డి ఓ ఉత్తర్వుల మేరకు కీసర ఎమ్మార్వో ఓక్ హుడ్ ఫామ్ హౌస్ ను సీజ్ చేయడం జరిగింది.

## బిజెపి సభ్యత్వాల పెంపు కోసం కృషి చేయండి

### కార్యకర్తలకు స్టేట్ కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్ పిలుపు



**ముస్తాబాద్, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల అధ్యక్షుడు మేరుగు అంజాగౌడ్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి స్టేట్ కౌన్సిల్ మెంబర్ గరిపెల్లి ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ రాష్ట్రశాఖ,జిల్లాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని 45 బూతులలో ప్రతి ఒక్క భూత్ అధ్యక్షుడు ఆ బూత్ పరిధిలో ఉన్న కార్యకర్తలు కలిసి పెద్ద ఎత్తున సభ్యత్వాలు చేసే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు.గత సభ్యత్వాల కంటె రెట్టింపు సభ్యత్వాలు చేయడానికి కృషి చేయాలని వచ్చే స్థానిక ఎన్నికల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఒక ఆయుదంలా పని చేస్తుందన్నారు.ప్రతి ఒక్క కార్యకర్త తప్పనిసరిగా తన విధిగా భావించి సభ్యత్వాలు చేయించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సభ్యత్వ జిల్లా కన్వీనర్ మల్లారపు సంతోష్ రెడ్డి, రాజసింగ్,వంగ అనిల్, మండల ప్రధాన కార్యదర్శులు సౌళ్ల క్రాంతి కుమార్,బాధ నరేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్లీ పోలీస్ వాలీబాల్ విజేత కిష్టాపూర్ జట్టు



**మేడ్చల్, ఆగస్ట్ 30 (నిఘా న్యూస్):** మేడ్చల్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మేడ్చల్ పోలీస్ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెండ్లీ పోలీస్ వాలీబాల్ టోర్నమెంట్ విజేతగా మేడ్చల్ మున్సిపల్ 4వ వార్డు కిష్టాపూర్ నిలిచింది.మొత్తం ఈ టోర్నీలో మండలం లోని 15 టీమ్ లు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్ లో పూడూరు, కిష్టాపూర్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్ లో విజేతగా నిలిచిన కిష్టాపూర్ జట్టు ట్రోఫీని సొంతం చేసుకుంది. రన్నర్ అఫ్ ట్రోఫీని పూడూర్ జట్టు కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ఏసిపి శ్రీనివాస్ రెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ ట్రోఫీలతో పాటు మెడల్స్ ను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి ఇరు జట్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ తుడుం గణేష్,జట్టు సభ్యులు కెప్టెన్ రాజు, భరత్, సాయినాథ్ రెడ్డి, అఖిల్ మహమ్మద్, మారుతి, పవన్,బి.నర్సింహా,వంశీ, సుందర్, సతీష్ పాల్గొన్నారు.

## నేడు కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

**పెబ్బేరు, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** పెబ్బేరు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 56 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను నేడు శనివారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేస్తున్నట్టు తహసిల్దార్ లక్ష్మి తెలిపారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని సూచించారు.

# పెంచిన పన్నులు తగ్గించే వరకు పోరాటం ఆగదు

### వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదు

### మాజీ మున్సిపల్ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్



**తూప్రాన్, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** అధికారం ఉంది కదా అని వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని తూప్రాన్ మాజీ మున్సిపల్ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్ పేర్కొన్నారు. ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ మున్సిపల్ ప్రజల పక్షాన నిలబడి పెంచిన పన్నులను రద్దు చేయాలని అధికారికి మెమొరండం అందచేస్తే విధులను దుర్వినియోగం చేశామని మాపైన కేసులు పెట్టడం సరికాదని వారు అసహనం వ్యక్తం చేశారు. గతంలో మేము అధికారంలో ఉండగా ఏనాడు సామాన్యుని నడ్డి విరిచే విధంగా పన్నులు పెంచ లేదన్నారు ముఖ్యంగా మున్సిపల్ లో పనిచేస్తున్న సఫాయి సిబ్బంది జీతాలు 5 నుండి 6 వేల వరకు ఉన్నదని వారు పలుమార్లు మాతో జీతభత్యాలు సరిపోవడం లేదని మొర పెట్టుకోవడం జరిగిందని దీని దృష్ట్యా మున్సిపల్ లోని వాణిజ్య వ్యాపార వర్తక సంఘ నాయకులను పిలిపించి కమర్షియల్ గా ఉన్న వ్యాపారస్తులతో సపాయి సిబ్బంది ఇబ్బందులను, గమనించాలని అందుకే కమర్షియల్ వ్యాపారస్తులపై కొంతమేర పన్నులు పెంచవలసి వచ్చిందని వివరించారు. ఏరకంగా పేద, మధ్యతరగతి, సామాన్య ప్రజల పైన పన్నుల భారం మోపలేదని వారు తెలిపారు. రాష్ట్రంలో ఏ మున్సిపల్ లో ఇప్పటి వరకు అధికారికంగా పన్నులు పెంచలేదన్నారు. పూర్తి ఆధారాలు మాదగ్గర ఉన్నాయన్నారు, ముఖ్యంగా నాపై చేస్తున్న వ్యక్తిగత ఆరోపణలను పూర్తిగా మానుకోవాలన్నారు మున్సిపల్ ప్రజా ప్రతినిధుల దృష్టి ప్రజల పైన ఉండాలి తప్ప ఎవరేం చేస్తున్నారని వ్యక్తిగత దూషణలకు పోకూడదని ఈ సందర్భంగా తెలియజేశారు. అంతేకాకుండా నా ఇంటి పన్ను ఫంక్షన్ హాల్ పన్ను కట్టలేదని ఇప్పుడున్న మున్సిపల్ ప్రజా ప్రతినిధులు నాపై తప్పుగా ఆరోపించడం సరికాదన్నారు. నేను కట్టిన ఇంటి పన్ను రసీదు నా వద్దనే ఉన్నదని పేర్కొంటూ శివ సాయి ఫంక్షన్ హాల్ నాది కాదని నాపేరు మీద లేదని ఇందులో నా కుటుంబ సభ్యులు భాగస్వాములుగా ఉన్నారని ఈ ఫంక్షన్ హాల్ ను లీజుకు ఇవ్వడం జరిగిందని దీన్ని బాగోగులు వారే చూసుకుంటున్నారని తెలిపారు. ఒకవేళ పన్నులు కట్టకపోతే అధికారులు డిమాండ్ పత్రాన్ని నోటీసులను జారీ చేయాలని, అలా కాకుండా అధికారులు నిర్లక్ష్యంతో మాపై బురద చల్లడం సమంజసం కాదని హితవు పలికారు. మా ఏకైక లక్ష్యం పెంచిన పన్నులను తక్షణమే ఉప సంహరించుకోవాలని లేనిపక్షంలో మున్సిపల్ ఆఫీస్ ఎదుట ధర్నాలు నిరసనలు పెద్ద ఎత్తున చేస్తామని డిమాండ్ చేశారు. మా ఏకైక ఎజెండా లక్ష్యం ప్రజల పక్షాన నిలబడి పెంచిన పన్నులను తగ్గించే వరకు ఉద్యమిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు బైరం సత్య లింగం, ఎండి సత్తార్, బొంది వెంకట గౌడ్, యూత్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, దుర్గా ప్రవీణ్ రెడ్డి, బనాపురం ప్రవీణ్, బి.మల్లేష్, తదితరులు ఉన్నారు.

# వలిగొండలో ఘనంగా కాటమయ్య బోనాలు



**వలిగొండ, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** వలిగొండ పట్టణ కేంద్రంలో శుక్రవారం కాటమయ్య బోనాలను మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన కాటమయ్య స్వామి బోనాలను గౌడ సంఘం ఆధ్వర్యంలో వైభవోపేతంగా నిర్వహించారు. ప్రతి ఏడాది శ్రావణమాసంలో గౌడ కులస్తులు కాటమయ్యకు బోనాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా పట్టణ కేంద్రంలో మహిళలు పసుపు కుంకుమ వేప కొమ్మలతో అలంకరించిన బోనం కుండలను నెత్తిన పెట్టుకొని భక్తి గీతాలు ఆలపిస్తూ ప్రధాన విధుల గుండా డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపు నిర్వహించారు. బోనాల ఊరేగింపులో శివశక్తుల విన్యాసాలు, యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కంఠ మహేశ్వర స్వామి ఆలయంలో బోనాలను సమర్పించారు. ఆలయంలో స్వామివారికి మారగోని వారి కుటుంబ సభ్యులచే అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటగా స్వామి కి వీర బోనం సమర్పించి అనంతరం మహిళలు తెచ్చిన నైవేద్యాన్ని కాటమయ్యకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంఘం అధ్యక్షుడు కొండూరు అజయ్ కుమార్ గౌడ్, మారగోని మల్లయ్య, పబ్బు భాస్కర్ మాజీ సర్పంచ్ పప్పు ఉపేందర్ బోస్, కొండూరు బాలరాజు, మెడికల్ షాప్ భాస్కర్ గౌడ్, పబ్బు స్వామి గౌడ్, మారగోని సత్యనారాయణ గౌడ్, మునుకుంట్ల ధనంజయ, బత్తిని దేవేందర్ గౌడ్, కొండూరు వెంకటేశం,రాగిరు మధు, కాసుల వెంకన్న,బత్తిని సైదులు గౌడ్, పల్సం రాజు గౌడ్, బత్తిని పాండుగౌడ్, మారగోని బిక్షపతి గౌడ్, బత్తిని పెద్ద నాగేష్ గౌడ్, మారగోని శ్రీనివాస్ గౌడ్, సెట్టయ్య, బత్తిని వరుణ్ గౌడ్, బత్తిని చిన్న నాగేష్, కొండూరు సాయి, గుండాల సాయి, పోలగోని నరేష్ గౌడ్, విష్ణు గౌడ్, గోధ రంజిత్ గౌడ్, బత్తిని వెంకట్ చిన్న గౌడ్, గౌడ బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరులో రేపు.. ఆదివాసి హక్కుల సంఘీభావ సదస్సు




**శ్రీకాకుళం, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** సెప్టెంబరు 1 వ తేదిన నెల్లూరులో జరిగే ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక సదస్సును జయప్రదం చేయాలని ప్రజా సంఘాలు,కమ్యూనిస్టు పార్టీలు,రైతు ఆదివాసి సంఘాలు పిలుపు నిచ్చాయి. శ్రీకాకుళం జిల్లా పలాస మండలం బొడ్డపాడులో అమరవీరుల స్మారక హాల్లో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో పౌర హక్కుల సంఘం దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం, ప్రజా కళామండలి, అమరుల బంధుమిత్రుల సంఘం, ఉత్తరాంధ్ర మహిళా సంఘం,సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యూ డెమోక్రసీ నాయకులు వంకలు మాధవరావు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్నటువంటి ధమలకాండను ఆపివేయాలని,వాళ్ళ హక్కులను కాపాడాలని నెల్లూరులో జరుగుతున్నటువంటి సదస్సుల జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పౌర హక్కుల సంఘం నాయకులు దానేష్ మాట్లాడుతూ నెల్లూరులో జరుగుతున్నటువంటి ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ ఆవిష్కరణలో దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం రాష్ట్ర నాయకులు వీరస్వామి,లక్ష్మణ గంగయ్య, బాలరాజు, పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి పిండి వెంకట్రావు, తెప్పల ఢిల్లీ రావు,వైకుంఠ రావు, పోలవరం లక్ష్మణ్, ప్రజా కళా మండలి నాయకులు చిరంజీవి, ఉత్తరాంధ్ర మహిళా సంఘం నాగమణి, పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు వినోద్,న్యూ డెమోక్రసీ వంకల మాధవరావు, భీమారం, పాపయ్య, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

# 2025 నాటికి... క్షయ రహిత భారతమే లక్ష్యం

### మేడ్చల్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రఘునాథ స్వామి






**మల్కాజిగిరి, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** ఇండస్ట్రీ యాక్షన్ మేనేజ్‌మెంట్ ఫర్ టిబి" అనే అంశంపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మేడ్చల్-మల్కాజిగిరిజిల్లావైద్యఆరోగ్యశాఖఅధికారి.డాక్టర్ టి.రఘునాథస్వామి అధ్యక్షతన కిన్నెర గ్రాండ్, ఎ.ఎస్.రావు నగర్‌లో జరిగింది. ఈ సమావేశంలో కొనసాగుతున్న టీబీ కార్యక్రమాలు, వాటి ప్రభావం, అలాగే టిబి నివారణ, నిర్వహణలో పరిశ్రమల ప్రమేయం, కీలక పాత్రపై చర్చలు జరిపారు. ఇన్ఫెక్షన్ ఉన్న ప్రదేశం, వ్యక్తి యొక్క రోగనిరోధక ప్రతిస్పందనపై ఆధారపడి టిబి వివిధ మార్గాల్లో వ్యక్తమవుతుందని డాక్టర్ రఘునాథస్వామి హైలైట్ చేశారు. సమర్థవంతమైన నివారణ, రోగనిర్ధారణ , చికిత్స కోసం టిబి రకాలను వ్యాధి ఎలా పురోగమిస్తుంది అనే విషయాలను అర్థం చేసుకోవడం చాలా అవసరమని ఆయన చెప్పారు. క్షయవ్యాధి నిర్మూలనలో అందరి సహకారం కావాలన్నారు. కేసు తగ్గింపు, అవగాహన స్థాయిలతో సహా విజయాన్ని అంచనా వేయడానికి కొలమానాలను కూడా ఈ సందర్భంగా చర్చించారు. అదనంగా అయామ్ ఫర్ ద టిబి ప్రాజెక్ట్ ఒక కీలక చొరవగా చర్చించబడింది. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం (ఎన్ టి ఈ పి) జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీదేవి క్షయవ్యాధి టిబి యొక్క స్వభావంపై ప్రదర్శనను అందించారు. ఇది ప్రధానంగా ఊపిరితిత్తులపై దాడి చేసే బ్యాక్టీరియా మైకోబాక్టీరియం ట్యూబర్ క్యులోసిస్ వల్ల కలిగే అంటు వ్యాధిగా అభివర్ణించారు. శరీరంలోని ఇతర భాగాలను ప్రభావితం చేస్తాయి. పల్మనరీ టిబి, ఎక్స్ట్రాపల్మోనరీ టిబి, లాటెంట్ టిబి ఇన్‌ఫెక్షన్, మిలియరీ టిబి, డ్రగ్-రెసిస్టెంట్ టిబి వంటి వివిధ రకాల టిబిలను ఆమె వివరంగా తెలియజేసింది, ముందస్తుగా గుర్తించడం చికిత్స ప్రాముఖ్యతను ఆమె వివరుంచారు. ఈ సమావేశంలో ని-క్షయ్ మిత్ర చొరవ, క్షయవ్యాధి నివారణ కార్యక్రమం, ప్రత్యక్షంగా గమనించిన చికిత్స, షార్ట్-కోర్సు డాట్స్ వ్యూహాన్ని కూడా ప్రస్తావించారు. ఈ ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. వివిధ లైన్ విభాగాల నుండి అభిప్రాయాలు మద్దతుపై చర్చించారు. 2025 నాటికి సమాజాన్ని టిబి రహితంగా మార్చాలనే లక్ష్యంతో టిబి అలర్ట్ ఇండియా ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. సమావేశంలో కీసర డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఓ డా.బి.సత్యవతిబీ వి.వెంకట్ శేఖర్, డి ఐ సి మేనేజర్‌బీ శశిధర్, ఎంఈఓ సురేఖ రెడ్డి, డి ఆర్ డి ఏ దామోధర్ రెడ్డి, పీఓ మెప్మా, నాగరాజ్, సూపరింటెండెంట్, కార్మిక శాఖ,ఎనుముల రాజు పటేల్, రాష్ట్ర ప్రోగ్రామ్ మేనేజర్‌బీ పరాసా, టిబి అలర్ట్ ఇండియా నుండి స్టేట్ లీడ్‌బీ యూపీఎచ్ సిలు, పిఏచ్ సిలు, ఎన్ టి ఈ పి సిబ్బంది పాల్గొన్నారు.

# కరీంనగర్ లో భారీ వాహనాలపై ఆంక్షలు

### కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి



**కరీంనగర్, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** గూడ్స్ ఇతర భారీ వాహనాలు ట్రాఫిక్ ప్రవాహానికి తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయని సాధారణ ట్రాఫిక్ సమయాల్లో ఇతర రహదారి వినియోగదారులకు కూడా ప్రమాదాన్ని కలిగిస్తున్నాయని, కరీంనగర్ నగరంలో పెద్ద సంఖ్యలో పాఠశాలలు, కళాశాలలు, వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ సంస్థలు ఇతర సంస్థలు ఉన్నందున సాధారణ ట్రాఫిక్ సమయాల్లో వాహనాల రాకపోకలు, పాదచారుల రాకపోకలు చాలా ఎక్కువగా ఉంటాయని అందువలన ప్రజల భద్రత, సౌలభ్యం దృష్ట్యా అటువంటి సమయాల్లో భారీ వాహనాల రాక పోకలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కరీంనగర్ కమిషనరేట్‌లో అన్ని కోణాల్లో విస్తరిస్తూ అభివృద్ధి చెందుతున్న ఫలితంగా వాహనాల సంఖ్య, ప్రజల రాకపోకలు భారీగా పెరిగాయి. కమిషనరేట్ పరిధిలో వాణిజ్య కార్యకలాపాలు, నివాస ప్రాంతాలు, పారిశ్రామిక కార్యకలాపాలు, విద్యా రంగం, ఉపాధి రంగం మొదలైన వాటిలో పెద్ద ఎత్తున వృద్ధి కనిపించడం వల్ల రోడ్ నెట్‌వర్క్ ఇతర ట్రాఫిక్ మౌలిక సదుపాయాలపై ఒత్తిడి పెరిగిందన్నారు. గూడ్స్/ట్రాన్స్‌పోర్ట్ వాహనాల రాకపోకల ఫలితంగా ట్రాఫిక్ రోడ్డు భద్రతా సిబ్బందికి ట్రాఫిక్‌ను నియంత్రించడం మరియు రహదారి భద్రత కోసం చేపట్టే చర్యలను అమలు చేయడం భారీ సవాలుగా మారిందన్నారు. కొన్ని రహదారులపై ట్రాఫిక్ రద్దీ, భారీ వాహనాల నిలుపుదల కారణంగా కరీంనగర్‌లోని వివిధ రహదారులపై అనేక ప్రమాదాలు నమోదవుతుండటం కారణంగా ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని గతంలోనే రెగ్యులేటరీ ఉత్తర్వులు జారీ చేశామని పేర్కొన్నారు. పరిస్థితిని ఇంకా మెరుగు పరచడానికి గత నోటిఫికేషన్‌లు/ఆర్డర్‌లలో వున్న లోటు పాట్లు ప్రస్తుత పరిస్థితుల అనుకూలంగా ట్రాఫిక్ నియంత్రించడానికి ఇతర శాఖల అధికారులు సంబంధిత వాటాదారులతో తగిన చర్చలు, సంప్రదింపులు చేశామని ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని, ప్రజల భద్రత, ట్రాఫిక్ నిర్వహణ దృష్ట్యా, కొన్ని పరిమితులు విధించాల్సిన అవసరం ఉందని పోలీస్ కమీషనర్ పేర్కొన్నారు. పరిమితులను ఉల్లంఘించి పట్టుబడిన వారిపై హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్, మోటార్ వెహికల్ చట్టం, ఇతర చట్టాల సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు చేపడతామని కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి తెలిపారు.



స్వదేశానికి విచ్చేసిన పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డిని తొర్రూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో విదేశీ పర్యటనను వినియోగించుకొని పాలకుర్తి నియోజకవర్గం వచ్చిన పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డిని ఘనంగా స్వాగతించారు.

–పాలకుర్తి, ఆగస్టు 30 (నిఘా న్యూస్):

## గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి



**దమ్మపేట, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** గణేష్ నవరాత్రులను దృష్టిలో పెట్టుకుని అశ్వారావుపేట సర్కిల్ పరిధిలో గణేష్ నవరాత్రులు ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు పోలీస్ శాఖ తరఫున గణేష్ నవరాత్రి మండపాల నిర్వహకులకు దమ్మపేట పోలీస్ స్టేషన్ నందు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో అశ్వారావుపేట సిఐ కరుణాకర్ పలు సూచనలు చేశారు. గణేష్ మండపాల నిర్వహకులు తప్పనిసరిగా స్థానిక పోలీసుల అనుమతి తీసుకోవాల్సి వుంటుందని, ఇందుకోసం ముందుగా నిర్వహకులు తాము ఏర్పాటు చేసే గణేష్ ప్రతిమ ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం,నిమజ్జనం తేదీ,ప్రదేశం మొదలైన సమాచారంతో తెలంగాణ పోలీస్ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ప్రోటోకాల్ వెబ్సైట్ ద్వారా మండపాల నిర్వహకులు పూర్తి వివరాలను నమోదుచేసుకోని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి సూచించారు.దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారులు ఆన్లైన్ ద్వారా అనుమతులు జారీచేస్తారని తెలిపారు. డిజె సౌండ్స్ కు అనుమతి లేదని.రహదారి పై ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా గణేష్ మండపాలు వేసుకోవాలి తెలిపారు.

## సహజ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



**సిరిసిల్ల, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** వేములవాడ పట్టణంలోని సహజ హాస్పిటల్ లో అరుదైన శస్త్ర చికిత్స చేసి ఆసుపత్రి వైద్యులు తేజేశ్వరి ఓ మహిళా ప్రాణాన్ని కాపాడారు. గంగాధర మండలం వెంకటాయ పల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ(45)గత సంవత్సరం కాలంగా గర్భసంచి గడ్డతో బాధపడుతుంది. దీంతో సహజ హాస్పిటల్ లో సంప్రదించగా ఆసుపత్రి వైద్యులు పరిశీలించి గడ్డను తొలగించేందుకు శుక్రవారం ఆపరేషన్ నిర్వహించారు. దాదాపు మూడు గంటల పాటు శ్రమించి ఐదు కేజీల బరువున్న గర్భసంచి గడ్డని తొలగించామని తెలిపారు.మహిళా ప్రాణానికి ప్రస్తుతం ఎలాంటి ప్రమాదం లేదని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.మూడు గంటల పాటు శ్రమించి ఆపరేషన్ విజయవంతం చేసిన ఆసుపత్రి నిర్వాహకులు, వైద్యులకు కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### బైక్ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు







**పెబ్బేరు, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** పెబ్బేరు మండలం జాతీయ రహదారిపై ఆదర్శ పాఠశాల దగ్గర ఆగి ఉన్న వ్యక్తిని చెలిమిల్ల గ్రామానికి చెందిన బీసన్న బైక్ ఢీ కొనడంతో ముగ్గురికి గాయాలు అయ్యాయి. వివరాల్లోకి వెళ్తే పెబ్బేరు మండలం చేలిమిల్ల గ్రామానికి చెందిన బీసన్న తన ద్విచక్ర వాహనంపై ఆత్మకూరు నుంచి వస్తుండగా జాతీయ రహదారిపై ఆదర్శ పాఠశాల దగ్గర ఆత్మకూరుకి చెందిన వ్యక్తికి ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హైవే అంబులెన్స్ కు సమాచారం తెలుపగా వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పెబ్బేర్ ఎస్ఐ హరి ప్రసాద్ రెడ్డిని వివరణ కోరగా ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని మా సిబ్బందిని అక్కడికి పంపించామని తెలిపారు. ఈ విషయంపై ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

## గణేష్ ఉత్సవాలు ఘనంగా ఏర్పాట్లు

### ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**కాప్రా, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** కాప్రా సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ జగన్ అధ్యక్షతన వినాయక చవితి, నిమర్జన ఏర్పాట్ల మీద అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. వినాయక చవితి వేడుకలు ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరు సంతోషంగా జరుగుకోవాలని అన్ని శాఖల అధికారులు అందుకు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి అని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలి అని పోలీసు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ ఏసిపి మహేష్, హరిలాల్, సిఐ అంజయ్య, డీజీఎం సతీష్, మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, ఎచ్ బి కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, బిఆర్ఎస్ పార్టీ గ్రేటర్ నాయకులు సాయి జెన్ శేఖర్ అన్ని విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డెంగ్యూ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

- మండల ప్రత్యేక అధికారులు హాస్టళ్ల ను తనిఖీ చేయాలి
- జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యకలాపాలు వేగవంతం కావాలి




**నారాయణపేట, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ డెంగ్యూ, ఇతర విష జ్వరాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, కేసులు ఎక్కువగా నమోదైన ప్రాంతాలలో ఎంపీడీఓ, మెడికల్ ఆఫీసర్లు సమన్వయంతో దోమల నివారణకు ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. ఆగస్టు నెలలో జిల్లాలోని వివిధ మండలాలలో నమోదైన డెంగ్యూ కేసులపై ఆమె ఆరా తీశారు. రెగ్యులర్ గా ఫాగింగ్ చేయించాలన్నారు. ఎంపీడీవోలు ఎంపిఓలు మెడికల్ ఆఫీసర్లు వారాని కోసారి సమన్వయ సమావేశం ఏర్పాటు చేసుకుని విష జ్వరాల నివారణకు ప్రత్యేక కార్యచరణ రూపొందించుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లోనూ మున్సిపల్ కమిషనర్లు సమన్వయం చేసుకోవాలన్నారు. జిల్లాలో తప్పనిసరిగా ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం నిర్వహించాలని ఆమె సూచించారు.

## కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ

### కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ లిహాజరైన ఎంపీ ఈటల, మాజీ మంత్రి మల్లారెడ్డి



**మేడ్చల్, ఆగస్ట్ 30 (నిఘా న్యూస్):** మేడ్చల్ మున్సిపాలిటీ 4వ వార్డుకు చెందిన నలుగురు లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని స్థానిక కౌన్సిలర్ తుడుం గణేష్ తెలిపారు. శుక్రవారం మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయంలో ఉమ్మడి మేడ్చల్ మండలంలోని లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ తుడుం గణేష్ మాట్లాడుతూ మేడ్చల్ మున్సిపాలిటీ 4వ వార్డుకు చెందిన నలుగురు లబ్ధిదారులు బండమీది అనసూయ, తాళ్ల కృష్ణవేణి వేముల పద్మ, దగ్గు సబిత లకు కళ్యాణ లక్ష్మీ చెక్కులను అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దయానంద్ యాదవ్, మేడ్చల్ మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భాస్కర్ యాదవ్, కౌన్సిలర్ ఉమా నాగరాజు, కోఆప్షన్ సభ్యులు అలీ, నవీన్ రెడ్డి, నాయక్కు సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


## సిఎంఆర్ఐటీలో ఓరియంటేషన్ ప్రోగ్రాం






**మేడ్చల్, ఆగస్ట్ 30 (నిఘా న్యూస్):** గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సిఎంఆర్ఐటీ కళాశాల 2024-2025 కొత్త విద్యా సంవత్సరానికి ప్రవేశం పొందిన మొదటి సంవత్సరం బి.టెక్ విద్యార్థుల కోసం 20వ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి ప్రస్తుత మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ గతంలో సిఎంఆర్ఐటీ లో చదివిన ఎంతో మంది విద్యార్థులు ప్రపంచం నలుమూలల ఉన్నారని తెలిపారు. మీరు కూడా 4 సంవత్సరాల తర్వాత మంచి ప్లేస్మెంట్స్ తో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాక్షించారు. సీఎంఆర్ గ్రూప్ సెక్రటరీ డా. గోపాల్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు కూడా తమ పిల్లలనునిరంతరం పరియవేక్షిస్తూ ఉండాలని తెలియజేసారు. నెలకొక సారి కళాశాలకు ఒచ్చి తమ పిల్లల అటెండన్స్, అకడమిక్ పర్ఫామెన్స్ గురించి తెలుసుకోవాలని తల్లిదండ్రులకు దిశ నిర్దేశం చేశారు. సీఈఓ అభినవ్ రెడ్డి మాట్లాడుతూ స్టూడెంట్స్ కొత్త కొత్త స్టార్టప్‌లతో ముందుకు రావాలని తెలియచేసారు. ఈ కార్యకమంలో, వివిధ డిపార్మెంట్ల హెచ్ఓడిలు, డీన్స్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన జడ్పిటిసి





**కల్లూరు, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** ప్రైవేటు ఉపాధ్యాయులు వేల్పుల రామారావు భూలక్ష్మి దంపతులు కుమార్తె ప్రిన్సిక అన్నప్రాసన వేడుక శుక్రవారం మండల పరిధి పోచారం గ్రామంలో జరిగింది. అయితే, అన్నప్రాసన కార్యక్రమం సందర్భంగా డబ్బులు, పుస్తకాలు, బంగారం, పెన్ను అహారం ఇలా వివిధ రకాల వస్తువులను పాప ముందుంచి ముట్టుకోమన్నారు. అయితే పాప పుస్తకాలను పట్టుకోవడంతో కుటుంబ సభ్యులంతా ఆనందాన్ని వ్యక్తం చేశారు. కాగా ఈ వేడుకలో కల్లూరు మండల జడ్పిటిసి కట్ట అజయ్ కుమార్, తాళ్లూరి శ్రీనివాసరావు, రాఘవరావు తదితరులు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.

చిలుకశ్వేర స్వామి..

# దేవాలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

### పాల్గొన్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ శివారెడ్డి



**చిలుకానగర్, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** చిల్కానగర్ చిలుకశ్వేర అంజనేయు స్వామి దేవాలయంలో ఆలయ పునర్నిర్మాణం కోసం శంకుస్థాపన మహెూత్సవ కార్యక్రమం ఆలయ కమిటీ అధ్యక్షులు దాసరి కృష్ణ, ప్రధాన కార్యదర్శి గోనె శ్రీకాంత్ ఆధ్వర్యంలో వేద పండితుల సమక్షంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, ఉప్పల్ మాజీ చైర్మన్ మేకల శివారెడ్డి, బిఆర్ఎస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ గీత శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శుంభ ప్రసాద్, బూరుగుల రమేష్ గౌడ్, జల్లి మోహన్, దేవసాని బాలచందర్, అంబటి జగదీష్, ఆర్. బలరాం, ఆడెపు అంజయ్య, శామీర్ పేట చంద్రయ్య, పాల్వంచ విఠల్, బోడ విద్యాసాగర్, పైడిపాల గౌరయ్య, దాసరి సిద్ధయ్య, గోపాల్ రెడ్డి, పొట్లూరి నర్సింహ్మా, పారెల్లి సాగర్, సంఘీ స్వామి యాదవ్, కొంపల్లి రవీందర్, ఈరెల్లి రవీందర్ రెడ్డి, పల్లె నర్సింగ్ రావు, కావాలి నర్సింహ్మా, వీరారెడ్డి, పలుగుల యాదగిరి, జిన్నా లక్ష్మీనారాయణ, మేఘ రెడ్డి, గూడ శ్రీశైలం, బండారి శంకర్, కొంపల్లి రాజు, మాస శేఖర్, గుడి మధుసూదన్ రెడ్డి, పిట్లల నరేష్, బూరుగుల వేణ్ గౌడ్, వాసు, రాంచందర్, పారుపాటి రాంరెడ్డి, రాంచందర్ రెడ్డి, పోనబోయిన సుధాకర్, డాక్టర్ అశోక్, అశోక్ చారి, చేర్యాల శ్రీనివాస్, వాసు, మల్లేష్, వేముల పరమేశ్, ఎక్కలదేవి, నర్సింహ్మాలు, ఎన్.మహేందర్, ఉమేష్ సింగ్, దండు అంజయ్య, యాదగిరి, పెరుమాళ్ శివ కుమార్, కృష్ణ రెడ్డి, రేషం మనోజ్ పోలోజు శ్రీనివాస్ చారి, శ్రీకాంత్ చారి పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు 25 వేల సాయం

### వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి




**పెబ్బేరు, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామం వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుల కుటుంబాలకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి భరోసా ఇచ్చారు. పిల్లల చదువులు, ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇంటి కేటాయింపుల్లో రెండు కుటుంబాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తామన్న ఎమ్మెల్యే అన్నారు. బుధవారం సాయంత్రం పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామం వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుల కుటుంబాలకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని ఆదేరువు కోల్పోయిన ఆ కుటుంబాలకు ఎలాంటి లోటు లేకుండా చూసుకుంటానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. మొదటగా మృతి చెందిన యువకుడు శ్రీపురం చందు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించే వారి తల్లిదండ్రులను ఓదార్చి ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా కల్పించారు. అనంతరం మరో యువకుడు కావలి అశోక్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే కుటుంబాలకు ఎలాంటి లోటు లేకుండా చూసుకుంటానని అన్నారు. కుటుంబ సభ్యులకు రూ. 25 వేల రూపాయలను తక్షణ సహాయం కింద అందించారు. కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపిపి రఘు ప్రసాద్, గ్రామ పెద్దలు, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువకులు వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి

**ఇల్లందు, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** ఎస్పి రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు ఇల్లందు డిఎస్పి చంద్రభాను ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి మండపాల నిర్వహకుల కు పలు సూచనలు చేశారు. గణేష్ మండపాల నిర్వహకులు తప్పనిసరిగా పోలీసులు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ముందుగా ఏర్పాటు చేసే గణేష్ ప్రతిమ ఎత్తు. ఏర్పాటు చేస్తున్న ప్రదేశం. నిమజ్జనం తేదీ. ప్రదేశం మొదలైన సమాచారంతో తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ప్రోటోకాల్ వెబ్సైట్ %ష్ట్రజూం://జూశీశ్రీఱ౧వజూశీతీ-ుఖశ్రీ.౦జూశీశ్రీఱ౧వ.ౖశీజ.ఱఅ% ద్వారా మండపాల నిర్వాహకులు పూర్తి వివరాలను నమోదుచేసుకోని రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారులు ఆన్లైన్ ద్వారా అనుమతులు జారీ చేస్తారని తెలిపారు. గణేష్ మండపాలను ఎవరికి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపం ఏర్పాటు చేసే స్థలం కోసం సంబంధిత శాఖల వారితో అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. గణేష్ మండపాల కొరకు విద్యుత్ శాఖ వారి అనుమతితోనే కనెక్షన్ తీసుకోవాలి. షార్ట్ సర్క్యూట్ జరగకుండా మంచి నాణ్యత గల వైరును ఉపయోగించాలి. గణేష్ మండపాల నిర్వాహకులు మరియు బాధ్యత వహించే వారి వివరాలు ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మండపంలో ఏర్పాటు చేయాలన్నారు. వృద్ధులు చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా తక్కువ శబ్ద కాలుష్యంతో స్పీకర్లను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలి. మండపాలలో ఎట్టిపరిస్థితిలోనూ డీజీలను ఏర్పాటు చేయరాదు. గణేష్ ప్రతిమలు కూర్చుండబెట్టే ప్రదేశంలో షెడ్డు నిర్మాణంలో మంచి నాణ్యత గల షెడ్ ఏర్పాటు చేసుకోవాలి. గణేష్ మండపంలో 24 గంటలు ఒక వాలంటరీ ఉండే విధంగా నిర్వాహకులు తగు చర్యలు తీసుకోవాలి. గణేష్ మండపాలకు వచ్చే భక్తుల సందర్శనను దృష్టిలో ఉంచుకొని మండపాలలో భక్తుల కోసం క్యూ లైన్లను ఏర్పాటు చేయడంతో పాటు వాలంటరీలను నియమించా లన్నారు. గణేష్ మండపాల వద్ద ఎప్పుడైనా అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ముందు జాగ్రత్తలో భాగంగా దగ్గర్లో రెండు బకెట్ల నీళ్లు ఇసుక ఏర్పాటు చేసుకోవాలి. గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం. పేకాట ఆడటం. లక్కీ డ్రాలు నిర్వహించడం. అసభ్యకరమైన నృత్యాల ఏర్పాటు. అన్య మతస్తులను కించపరిచే విధంగా ప్రసంగాలు చేయడం పాటలు పాడటం పై పూర్తిగా నిషేధం అన్నారు. విధిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలి. పోలీస్ అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు అందులో వ్రాసి సంతకం చేస్తారన్నారు. మండపాల్లో ఏదైనా అనుమానస్పదంగా బ్యాగులు ప్లాస్టిక్ సంచులు వస్తువులు లేదా వ్యక్తులు కనిపించి నట్లయితే తక్షణమే డైల్ 100 గాని లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని మతాలకు చెందిన మత పెద్దలు ఇల్లందు సిఐ బత్తుల సత్యనారాయణ ఎస్సై పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం



**కరీంనగర్, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** కరీంనగర్ జిల్లాలోని మానకొండూరు మండల నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ గా లలితాపూర్ గ్రామానికి చెందిన మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ గా రంగపేట గ్రామానికి చెందిన రామిడి తిరుమల్ రెడ్డి, మరియు డైరెక్టర్స్ ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి పదవి బాధ్యతలు మార్కెట్ అధికారి చేత పదవి బాధ్యతలు స్వీకరించారు. మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా మానకొండూర్‌శాసనసభ్యులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మానకొండూరు చెరువు కట్ట నుండి మార్కెట్ యాడ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే రైతు సంక్షేమం కోరుకునే పార్టీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశంలో ఎక్కడి లేని విధంగా రైతులకు ఒకేసారి రెండు లక్షల రుణమాఫీ చేశాడు, మానకొండూరు మండలంలోని దాదాపు 8 వేల మంది రైతులకు ఇప్పటివరకు 55 కోట్ల రూపాయల రుణమాఫీ జరిగిందన్నారు. పలు సాంకేతిక కారణాలవల్ల ఇంకా కొంతమంది రైతులకు రుణమాఫీ జరగలేదు ఈ మండలంలో రుణమాఫీ కానీ రైతులను అధికారులు గుర్తిస్తున్నారాని. ఇప్పటివరకు 1800 మంది రైతులను గుర్తించారు. త్వరలోనే వారికి కూడా రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్ మీడియా సమావేశం పెట్టి అబద్ధాలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారాని గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో నిర్మించిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారానే అన్ని ప్రాజెక్టులకు నీరు పంపింగ్ చేయడం జరుగుతుందాని, కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిన శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా మిడ్ మానేరు, అనంతగిరి రిజర్వాయర్, రంగనాయక సాగర్, ఎల్ఎండి ప్రాజెక్టులోకి నెల రోజుల్లో 20 టీఎంసీల నీరు పంపిణీ చేయడం జరిగిందని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రతిరోజు ఉన్నతాధికారులతో మాట్లాడుతూ అధికారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ రైతుల సంక్షేమం కోరుకునే పార్టీ కాబట్టి నీరు పంపింగ్ చేస్తున్న చేయడం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారు ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. నూతనంగా కొలువుదీరిన మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా చైర్మన్, మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్, రామిడి తిరుమల్ రెడ్డి, డైరెక్టర్స్ రేమిడి శ్రీనివాస్ రెడ్డి, గాజుల వెంకటేశ్వర్లు, పాకాల వందన, సాపిరీ అంజయ్య, టేకుమల్ల అంజయ్య, వేల్పుగొండ రాజు, చలుగంటి ఓదెలు, మాతంగి సహదేవ్, దాసరి శ్రీనివాస్, బందేలా మహేందర్, మందల మహిపాల్ రెడ్డిమాట్లాడుతూ మనకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాపై నమ్మకంతో మాకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు రుణపడి ఉంటామని, రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి రైతు సమస్యలపై పోరాడుతామని, రైతుల అభివృద్ధికి తోడ్పడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ అధికారులు, ఎం ఆర్ ఓ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలు ఘనంగా ఏర్పాట్లు

### ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**కాప్రా, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** కాప్రా సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ జగన్ అధ్యక్షతన వినాయక చవితి, నిమర్జన ఏర్పాట్ల మీద అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. వినాయక చవితి వేడుకలు ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరు సంతోషంగా జరుగుకోవాలని అన్ని శాఖల అధికారులు అందుకు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి అని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలి అని పోలీసు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ ఏసిపి మహేష్, హరిలాల్, సిఐ అంజయ్య, డీజీఎం సతీష్, మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, ఎచ్ బి కాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, బిఆర్ఎస్ పార్టీ గ్రేటర్ నాయకులు సాయి జెన్ శేఖర్ అన్ని విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా పేదలకు సాయం

### ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



రామడుగు, ఆగస్టు 30 (నిఘా న్యూస్): ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. రామడుగు మండల కేంద్రంలోని రైతు వేదిక ముందు శుక్రవారం మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం రైతు వేదికలో సమావేశం నిర్వహించి రామడుగు మండలానికి చెందిన 283 మంది లబ్ధిదారులకు 70 లక్షల 7వేల 527 రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పార్టీలతో సంబంధం లేకుండా అందరికీ సహాయం చేయాలనే ఉద్దేశంతో అనేక మంది ప్రజలు అనారోగ్యంతో ఆసుపత్రి పాలై లక్షలు ఖర్చుపెట్టి చాలా దినవస్థలో ఉన్న వారందరిని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా తమ వంతు ఆర్థికంగా సాయం చేస్తూ ఆదుకున్నామన్నారు. గత ప్రభుత్వ హయంలోని దరఖాస్తులను పక్కన పెట్టకుండా అందరికీ సమన్యాయం చేయాలని చెక్కులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ప్రతి దరఖాస్తు దారునికి అండగా ఉంటామని చెక్కు అందజేయడం జరిగిందని తెలిపారు. ఐదేళ్లకోసారి ఎన్నికలు ఉంటాయని ఎవరు ఏ పార్టీలో ఉన్నా నేను మాత్రం ప్రతి ఇంటి బిడ్డలా ఉంటానని తెలిపారు. గత ప్రభుత్వ హయంలో వారి పార్టీలో ఉంటేనే సీఎం సహాయనిధిగాని, దళిత బందు గాని ఇస్తామని చాలామందిని మధ్య పెట్టారని, నేను అలాంటివి చూడనని నా నియోజకవర్గ బిడ్డలైతే చాలు మీ ఆపదలో మీ కష్టంలో ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అనిల్ ప్రకాష్ కిరణ్ కుమార్, తహసిల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో రాజేశ్వరి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొమ్మరవేని తిరుపతి ముదిరాజ్, తాజా మాజీ ఎంపీపీ జవాజి హరీష్, కోల రమేష్, పంజాల శ్రీనివాస్ గౌడ్, పూరేళ్ల గోపాల్ గౌడ్, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, వివిధ గ్రామాల కార్యదర్శులు, లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాపుల్లో బీసీలకు అవకాశం కల్పించాలి

### బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు శీలం స్వామి



**ముస్తాబాద్, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ తాసిల్దార్ కార్యాలయానికి విచ్చేసిన అడిషనల్ కలెక్టర్ కిమ్యా నాయక్ ను కలసి ముస్తాబాద్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న చౌకధరల దుకాణం (రేషన్ షాప్)లలో బీసీలకు అవకాశం కల్పించాలని బీసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. గతంలో అవకాశం ఇవ్వలేదని, షాపులు ఇచ్చి 30 ఏళ్ళు అవుతుందని, ప్రస్తుతం ముస్తాబాద్ పట్టణ జనాభాలో బీసీలు దాదాపు 55 నుండి 60 శాతం ఉన్నారని జనాభా ప్రాతిపదికన బీసీలకు చౌక ధరల దుకాణంలో (రేషన్ షాప్)లో నూతనంగా ఏర్పాటు చేసి షాపుల్లోనైనా అవకాశం కల్పించి, తద్వారా బీసీలకు సముచిత స్థానం ఇవ్వాలని ముస్తాబాద్ గ్రామ ప్రజలు, బీసీల పక్షాన బీసీ సంఘం యూత్ రాష్ట్ర నాయకులు శీలం స్వామి కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ నాయకులు మెంగని మనోహర్, మండల బీసీ నాయకులు కోడె శ్రీనివాస్, రాజు తదితరులు ఉన్నారు.

# వినాయక ఉత్సవాలపై కలెక్టర్ సమీక్ష

### అన్ని శాఖలు సన్నద్ధంగా ఉండాలని ఆదేశం





**కలెక్టరేట్, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** వినాయక నవరాత్రులు, నిమజ్జనానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీగా నిర్వహించాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం అధికారులను ఆదేశించారు. శుక్రవారం మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వినాయక నిమజ్జన ఏర్పాట్ల పై నిర్వహించిన సమన్వ సమావేశంలో అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి, రాధికా గుప్తా,రాచకొండ డిసిపి కరుణాకర్, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియ లతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 17 చెరువులు ఉన్నాయని, వాటిలో వినాయక నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకోవటంతో పాటు నిమజ్జనానికి అవసరమైన రూట్ మ్యాప్ సైతం సిద్ధం చేసుకొని అందుకు అవసరమైన రూట్లలో రోడ్డు మరమ్మతు పనులు వెంటనే చేపట్టి పూర్తి చేయాల్సిందిగా ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. వినాయక నిమజ్జనానికి వినియోగించే వాహనాలను ముందస్తుగా రవాణా శాఖ అధికారులు సర్టిఫై చేయాలని ప్రతి గణేష్ మండపం వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, గణేష్ నిమజ్జనం సజావుగా జరిగే విధంగా కట్టుదిట్టమైన భద్రత ఉండేలా ఏర్పాట్లు చూడాలని పోలీస్ శాఖ అధికారులకు కలెక్టర్ తెలిపారు. వినాయక నిమజ్జనానికి చెరువుల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఫస్ట్ ఎయిడ్ కిట్లతో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, కింది స్థాయి సిబ్బందితో మెడికల్ బృందాలను ఏర్పాటు చేసి 24 గంటలు షిఫ్టుల వారిగా విధులు నిర్వహించేలా, అదే విధంగా అంబులెన్సును అందుబాటులో ఉండేలా, అత్యవసర సమయాలలో బయటకు వెళ్లే దారి క్లియర్ గా ఉండేలా చూడాలని కలెక్టరు మెడికల్ అధికారులను ఆదేశించారు. వైద్య శిబిరాలు ప్రజలకు కనిపించేలా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎమర్జెన్సీ సందర్భంలో దగ్గరలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో ఉచితంగా ఫస్ట్ ఎయిడ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు సూచించారు. నిమజ్జన ప్రదేశాలలో గతంలో కంటే అధిక సంఖ్యలో గజ ఈతగాళ్ళను అందుబాటులో ఉంచాలని జిల్లా మత్స్య శాఖ అధికారికి కలెక్టర్ సూచించారు. వినాయక నిమజ్జన స్థలాల వద్ద భారీ క్రేన్లు ఏర్పాటు చేయాలని నిమజ్జనానికి నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్తు శాఖ అధికారులు ఇప్పటి నుంచే అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ప్రతి నిమజ్జన స్థలం వద్ద అదనపు ట్రాన్స్ఫార్మర్లు, పవర్ జేనరేటర్లను ముందు జాగ్రత్తగా అందుబాటులో ఉంచడంతో పాటు వినాయక నిమజ్జన సమయంలో విద్యుత్ తీగల సమస్య ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకొని అవసరమైన చర్యలను తీసుకోవాలని కలెక్టర్ విద్యుత్తు శాఖ అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఎలక్ట్రిక్ డిపార్ట్ మెంట్ వారు అవసరమైన మేరకు నిరంతర విద్యుత్తును సరఫరా చేస్తూ, ప్రతి చెరువు దగ్గర లైన్ మెన్ ను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ట్రాఫిక్ అధికారులకు కలెక్టరు తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి వారు చెరువుల వద్ద పొల్యూషన్ లెవెల్స్ చెక్ చేస్తూ ఉండాలన్నారు. గణేష్ నవరాత్రులు మొదలు కొని నిమజ్జనం పూర్తయే వరకు అగ్ని మాపక శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, మండపాలలో అనుకొకుండా అగ్నిప్రమాదం జరిగితే ఏవిధమైన నివారణ చర్యలు తీసుకోవాలనే అంశం పై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని అగ్నిమాపక అధికారులకు ఆదేశించారు. ప్రతి నిమజ్జన చెరువులకు ఒక నోడల్ ఆఫీసర్ తో పాటు సంబంధిత శాఖల సిబ్బందితో కూడిన బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జనానికి అవసరమైన క్రేన్లను ఏర్పాటు చేయడం తోపాటు అదనంగా కొన్ని క్రేన్లను సన్నద్ధం చేయాలన్నారు. శామీర్ పేట చెరువు దగ్గర అవసరమైన మోబైలు టాయిలెట్లను ఏర్పాటు చేయాలని సంబంధిత మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ ఉత్సవ కమిటీ సభ్యులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో పోలీసు, ట్రాఫిక్, మత్స్య, వైద్య, అగ్నిమాపక, అర్ అండ్ బి, పొల్యూషన్, విద్యుత్తు, జలమండలి శాఖల అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు, తహశీల్దార్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాలమాకుల గురుకుల పాఠశాలలో పురుగుల అన్నం

### బీజేపీ రజక సెల్ కన్వీనర్ ఎం.రాజేశ్వరి



**సికింద్రాబాద్, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** జగిత్యాల జిల్లా మెటుపెల్లి మండలం పెద్దపూర్ గొల్లపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో విద్యార్థినులు కలుషిత ఆహారం తిని అస్వస్థత గురైన సంఘటన మరిచిపోక ముందే, శంషాబాద్ మండలం పాలమాకుల గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు పురుగుల అన్నం పెడితే ఇదేంటి అని విద్యార్థినులు ప్రశ్నిస్తే ఇంటి నుండి బాక్స్ తెచ్చుకొండని దురుసుగా మాట్లాడి విద్యార్థినుల కళ్ళల్లో కారం కొట్టిన సిబ్బందిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుని విద్యార్థినులకు న్యాయం చేయాలని బిజెపి రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ యావత్ తెలంగాణ వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థినులు పాముకాటుకు గురై చనిపోయారని, అంటు వ్యాధులకు గురైతే ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని అన్నారు. విద్యార్థులు అంటే భావిభారత నిర్మాతలు అని అలాంటి వారికి స్వాతంత్రం సిద్ధించి 78 సంవత్సరాలు గడిచిన పాఠశాలల్లో కనీస సౌకర్యాలు సమకూర్చక పోవడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. పాఠశాలల్లో సిబ్బంది చెప్పినట్టు వినకుంటే విద్యార్థులను పరీక్షల్లో ఫెయిల్ చేస్తామంటూ సిబ్బంది బెదిరించడం హేయమైన చర్య అని అది భరించలేక ఒకవేళ విద్యార్థిని, విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని ఆగర్భశోకం ఎవరికి తెలుసని ప్రశ్నించారు. గత పది రోజుల క్రితం జగిత్యాల జిల్లాలో గురుకుల పాఠశాలల్లో తనికీలు చేసిన మంత్రులు బట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్ లు విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తామని చెప్పిన అనతి కాలంలోనే ఇలాంటి సంఘటన జరగడం దురదృష్టకరమని విద్యార్థులకు వెంటనే కనీస సౌకర్యాలు కల్పించి భావి భారత నిర్మాతలుగా తీర్చిదిద్దడానికి అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు..

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



**మేడిపల్లి, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** శాఖపరమైన మరమ్మతులు కొత్త సర్వీసుల విడుదలలు మరియు 33కెవి కొత్త లైన్ స్ట్రింగింగ్ వర్క్స్ పనుల కారణంగా శనివారం ఉదయం 10:30 గంటల నుండి 11:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పిర్జాదిగూడ ఏ ఈ సత్యనారాయణ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 3/11 కేవీ పర్వతాపూర్ సబ్ స్టేషన్ 11 కేవీ సత్యనారాయణపురం ఫీడర్ పరిధిలో ప్రభావిత ప్రాంతాలు ఇంద్రప్రస్థ,సాయి మహదేవ్ నగర్,సాయి ఐశ్వర్య కాలనీ, వెంకటరమణ పురం, సత్యనారాయణ పురం కాలనీ. మధ్యాహ్నం 12:30 నుండి 01:00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. 11 కెవి శంకర్ నగర్ ఫీడర్ నుండి 33/11కెవి పీర్జాదిగూడ సబ్ స్టేషన్ వరకు ప్రభావిత ప్రాంతాలు ప్రాంతాలు: శంకర్ నగర్, శ్రీ రామ ఆర్టీసీ కాలనీ,గణేష్ నగర్, విష్ణుపురి ఎన్క్లేవ్, శ్రీపాద ఎన్క్లేవ్, బండి సత్తయ్య కాలనీ, పారావతి నగర్,రామకృష్ణ నగర్ వరకు ప్రతాప్ సింగారం సబ్ స్టేషన్ పరిధిలో 33కేవీ కొత్త లైన్ స్ట్రింగ్ వర్క్స్, కాచవని సింగారం 33/11కెవి ఫీడర్ కారణంగా ఉదయం 11:30 గంటల నుండి 03:30 గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు. ముత్తువెల్లిగూడ,హిల్స్ వ్యూ కాలనీ,డ్రీమ్ హోమ్స్ కాలనీ, శ్రీదా హోమ్స్,దేవిశ్రీ హోమ్స్, మహేశ్వరి కాలనీ, కాచవాణి సింగారం, ఆర్టీసీ కాలనీ, బృందావన్ కాలనీ,క్రంటిదీప కాలనీ వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. 11 కెవి ప్రతాప్ సింగారం డొమెస్టిక్ ఫీడర్ నుండి 33/11కెవి ప్రతాప్ సింగారం సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 01:00 గంటల నుండి 01:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆ సమయంలో ప్రతాప్ సింగారం గ్రామం, తేజశ్రీ హోమ్స్, గణేష్ నగర్, మహంకాళి కాలనీ, ఎస్ సి బస్తీ, గౌరెల్లి రోడ్, ఎస్ సి బస్తీ కాలనీలలో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు. వినియోగదారులు వ్యాపారస్తులు తమ సిబ్బందితో సహకరించాలని ఏ ఈ సత్యనారాయణ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## జంట హత్యల కేసులో జీవిత ఖైదు ఖరారు

### విలేకరుల సమావేశంలో సిఐ మధు




**మధిర, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** మండల పరిధిలోని రాయపట్న గ్రామంలో కన్నపిల్లలను హతమార్చిన కేసులో నిందితుడు పార్శపు శివరాం గోపాల్ కి సత్తుపల్లి సెషన్స్ జడ్జి శ్రీనివాస్ జీవిత ఖైదు విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చినట్లు మధిర సీఐ మధు తెలిపారు. శుక్రవారం మధిర సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయపట్నం గ్రామానికి చెందిన పారిశపు మార్తమ్మ (చిన్నమ్మాయి)కి పార్శపు శివరాం గోపాల్తో వివాహము జరిగింది. వారికి ఇద్దరు సంతానం ఉన్నారన్నారు. 8 సంవత్సరాల తన కుమారుడు రామకృష్ణ, ఆరు సంవత్సరాల కుమార్తె ఆరాధ్య రాయపట్నం స్కూల్ లో బాబు మూడవ తరగతి పాప ఒకటో తరగతి చదువుతున్నారని తన భర్త పెళ్లి అయిన దగ్గర్నుండి మద్యం తాగి వచ్చి ఫిర్యాదురాలను అనుమానించి కొట్టడం, వేధించడం అలాగే పిల్లలు ఇద్దరిని కూడా కొట్టేవాడని ఆయన వివరించారు. గొడవ విషయమై అనేకసార్లు పెద్ద మనుషుల్లో మాట్లాడుకోవడం జరిగిందన్నారు. 2023 జులై 7న కుమార్తె ఆరాధ్య స్కూలుకు వెళ్లగా ఫిర్యాదు కుమారుడు కాలికి దెబ్బ తగలడం వల్ల ఇంటి వద్దనే ఉండి తన స్కూలుకు సమీపంలో పిల్లలతో ఆడుకొనుటకు వెళ్ళిన సమయంలో ఫిర్యాదు భర్త ఆయన ముద్దాయి ఫిర్యాదు భర్త ఆయన శివరాం గోపాల్ తన తల్లి ఇంటి వద్దకు వచ్చి పిల్లవాడి గురించి అడగగా ఆడుకొనుటకు వెళ్ళినాడు అని చెప్పగా ఫిర్యాదు భర్త అక్కడనుండి వెళ్లిపోయినాడు. అదేరోజు సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో ఫిర్యాదురాలు అనుమానం వచ్చి తన తల్లిని పంపించగా ముద్దాయి తన కొడుకును పట్టుకొని రాయపట్నం బస్టాండ్ సెంటర్ నందు ఉండగా ఫిర్యాదు తల్లి పిల్లవాడిని పంపమని అడగగా కటింగ్ చేయించి పంపుతాను అని చెప్పినట్లు సీఐ వివరించారు. ఫిర్యాదు తల్లి అక్కడ నుంచి వెళ్లిపోవడంతో ఆ సమయంలో అక్కడ ప్రత్యక్ష సాక్షులైనటువంటి శివదాసు అచ్యుతరావు, కటారపు బోసు ఉన్నారు. తర్వాత పిల్లలందరూ స్కూల్ నుంచి ఇంటికి వచ్చి తన కూతురు రాకపోవడంతో ఫిర్యాదురాలు స్కూలుకు వెళ్లి అడుగగా అక్కడ టీచర్స్ వాళ్ళ నాన్న వచ్చి తీసుకొని వెళ్ళినారు అని చెప్పినారు. తర్వాత ఫిర్యాదురాలు తన తల్లి మరియు రాయపట్నం గ్రామానికి చెందిన దేవరకొండ శైలజ, పేర భక్తుల పవన్ కుమార్ అందరూ కలిసి పిల్లల కోసమే వెతకగా ఎక్కడా కనిపించలేదన్నారు తర్వాత సాయంత్రం 6 గంటల సమయంలో ఫిర్యాదురాలి భర్త ఉంటున్న పాత ఇంటికి వెళ్ళగా తలుపులు దగ్గరికి వేసి ఉండటం గమనించి తలుపులు తెరవగా ఇంటి లోపల ఫిర్యాదు ఇద్దరు పిల్లలు రెండు దుప్పట్లలో చుట్టబడి ఉండటం చూసి వెంటనే ఫిర్యాదురాలు దుప్పట్లు తొలగించి తన పిల్లలను చూడగా ఎటువంటి కదలికలు లేకుండా పడి ఉండటంతో తమ గ్రామానికి చెందిన ఆర్.ఎం.పి డాక్టర్ను పిలిపించి చూపించగా అతని పరీక్షించి మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్ళమని చెప్పినట్లు తెలిపారు. వెంటనే మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వెళ్ళగా డాక్టర్ పరీక్షించి చనిపోయినారు అని చెప్పినారు. ఫిర్యాదు మరియు తన పిల్లలు తన భర్త దగ్గరికి వెళ్లడంలేదు అని మనసులో కోపం పెంచుకొని అభం శుభం తెలియని తన పిల్లలను చంపిన తన భర్త పై తగు చర్య తీసుకొనమని ఫిర్యాదు ఇచ్చినారు. అప్పటి ఎస్ఐ ఐపిఎస్ అవినాష్ కుమార్ ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కేసు ప్రస్తుత సీఐ మధు పర్యవేక్షణలో ప్రస్తుత ఎస్సై సంధ్య విచారణ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ అబ్దుల్ భాష ఫిర్యాదు తరపున వాదించడం జరిగిందన్నారు.

## సమస్యలు నెరవేర్చక పోతే మళ్ళీ ఆందోళన




### 40 డివిజన్ లోని సమస్యలను పట్టించుకోని మేయర్

**వరంగల్, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** 40 డివిజన్ లోని ప్రజలకు మౌలిక సదుపాయంలతో పాటు అభివృద్ధి పనులు అధికారులు చేపట్టనట్లయితే మళ్లీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని 40 వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. శుక్రవారం డివిజన్ సమస్యలు పరిష్కారానికి రాజకీయాల కతీతంగా మహా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద జరిగిన ప్రజా ధర్నా కార్యక్రమంలో మాట్లాడారు. మేయర్ కమిషనర్ అధికారుల నిర్లక్ష్యం వలననే డివిజన్ లో అభివృద్ధి పనులు జరుగుట లేదని వారి వైఖరి మారాలని ఆయన కోరారు ఏ ఒక్క పని అధికారులు శ్రద్ధ చూపటం లేదని ఎన్నో మార్ల దృష్టికి తీసుకువచ్చిన ఫలితం కానా రావడం లేదన్నారు. డివిజన్ లో పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లు ముందుకు వస్తున్నా కొంత మంది అధికారులు సిద్ధంగా లేరన్నారు. బాక్స్ డ్రైన్ నిర్మాణానికి టౌన్ ప్లానింగ్ అధికారులు మార్కింగ్ ఇవ్వనందులనే స్మశాన వాటిక మునిగి పోతుందన్నారు. పెరుగొప్ప ఊరు దిబ్బ అన్నట్లు ఉంది మహానగరపాలక సంస్థలో మట్టి రోడ్లు ఎగుడుదిగుడు గా దర్శనమిస్తున్నాయని, స్మశానవాటికలు అధ్వానంగా ఉన్నాయని పైప్ లైన్లు కరెంటు స్తంభాలు లేక చీకట్లో వెళ్లవలసిన పరిస్థితులు డ్రైనేజీ నిర్మాణం లేక ఇండ్లలోకి నీరు వస్తుందని కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి నశించాలని మేయర్ కమిషనర్ వెంటనే చొరవ చూపాలని నినాదాలు చేశారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ మహా నగరపాలక సంస్థ కమిషనర్ అందుబాటులో లేనందున అడిషనల్ కమిషనర్ రాజేందర్ రెడ్డికి 13 డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఇట్టి ప్రజా ధర్నా కార్యక్రమంలో పూజారి విజయ్ ఆవుల శ్రీకాంత్ కూరపాటి రాజన్ బాబు ఆవునూరి ఐలేశం అవునూరి నాగరాజు శ్రీపాద హరిప్రసాద్ మదూరి సుధాకర్ గౌడ్ అన్న శ్రీనివాస్ పసునూరి రాజు పుష్పలత వనం కుమార్ మరుపల్ల గౌతమ్ శెట్టి మోహన్ గజ్జి సాంబయ్య సాదులరంజిత్ ఎండి వహీదా కళ్యాణపు వెంకటేశ్వర్లు చీర రమేష్ అనుమాండ్ల శ్రీనివాస్ మునిరుద్దీన్ బౌరి శెట్టి సదానందం వెంగళ రాజనర్సు మంద నవీన్ టం టం నరసింహ వేల్పుగొండ నర్సింగ్గం పేర్న రవి లక్క నరసింగం బొల్లం యాకయ్య దార్ల రాజేశ్వరరావు బాసిత్ కర్ సాయి కృష్ణ ఆకుతోట శ్రీకాంత్ మెంతుల శంకర్ ఐల మహేష్ మోహన్ నరేష్ హరీష్ లు పాల్గొన్నారు.

## విశ్వహిందూ పరిషత్.. బజరంగ్ దళ్ నూతన కమిటీ

- విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు గూడెపు దేవేందర్
- బజరంగ్ దళ్ మండల అధ్యక్షుడు ప్రశాంత్





**ముస్తాబాద్, ఆగస్ట్ 30 (నిఘా న్యూస్):** హిందువులపై దాడి,హిందూ యువతులను లవ్ జిహాద్ పేరుతో చేస్తున్న మోసాలను అరికట్టడంతో పాటు సనాతన ధర్మాన్ని రక్షించేందుకు ప్రతి హిందూ యువకులు ముందుకు రావాలని బజరంగదళ్ జిల్లా కో- కన్వీనర్ కన్నం శంకర్ సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో పిలుపునిచ్చారు. ముస్తాబాద్ పట్టణంలోనీ స్థానిక మాతృశ్రీ గార్డేన్ లో విశ్వహిందూ పరిషత్,భజరంగ్ దళ్ మండల నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి విశ్వహిందూ పరిషత్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చేపూరి అశోక్ , భజరంగ్ దళ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కో కన్వీనర్ కన్నం శంకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో విశ్వహిందూ పరిషత్ ముస్తాబాద్ మండల అధ్యక్షునిగా గూడెం దేవెంధర్, భజరంగ్ దళ్ ముస్తాబాద్ మండల అధ్యక్షునిగా పోతుగల్ కు చెందిన ప్రశాంత్,గోరక్షక్ దళ్ మండల అధ్యక్షునిగా చేపూరి రాకేష్, ముస్తాబాద్ నగర సంయోజక్ అధ్యక్షునిగా మద్దికుంట రమేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశ్వహిందూ పరిషత్ మండల కార్యవర్గంలో బాదవేని శ్రీనివాస్ గౌడ్, మ్యాన రాజేష్, అబ్రవేని దేవేందర్, కొడిముంజ శ్రీనివాస్, కాల్వ బాలాజి, అలాగే భజరంగ్ దళ్ మండల కార్యవర్గంలో బండి ప్రశాంత్, కస్తూరి మధు, బోయ నవీన్, మేరుగు శ్రీరామ్, గోట్టేసాయి, కుడుకల మహేష్, కనుకయ్య, సుజిత్, అభి, నిశ్వంత్, చెల్మ శ్రీకర్, నాళ్ళ వినయ్ చారి, నీరటి సాయిలును నియమాకం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ మండలంలో హిందూ ధర్మాన్ని మరియు హిందూ సంప్రదాయాలను కాపాడటానికి అందరూ కంకణబద్ధులై ఈ దేశానికి సేవ చేయాలని వెల్లడించారు. అలాగే హిందువులపై దాడి, యువతులను లవ్ జిహాద్ పేరుతో చేస్తున్న మోసాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు కోళ్ల కృష్ణ గౌడ్, కస్తూరి కార్తీక్ రెడ్డి, వరి వెంకటేశ్, చిట్నేని శ్రీనివాస్ రావు, కొండబాను,మహేష్, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## సాహితీ సవ్యసాచి శంకరమంచి శ్యాంప్రసాద్



**పాలకుర్తి, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** తెలుగు సాహిత్య చరిత్రలోను, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలోను పేరుగాంచిన వీరభూమి పాలకుర్తి. అది ఎంతోమంది మేధావులకు, కవులకు, కళాకారులకు కాణాచి హరిహరాద్వైతానికి ప్రతీకగా అన్నట్లు కొండపై రెండు వేరు వేరు గుహలలో శ్రీ సోమేశ్వర లక్ష్మీ నృసింహస్వాముల స్వయంభువులుగా వెలసి భక్తుల నీరాజనాలం దుకుంటున్నారు. తెలుగు సాహిత్య ప్రపంచంలో సూర్యచంద్రు లనదగిన పాల్కురికి సోమన, బమ్మెర పోతన ఇక్కడివారే. ఇక్కడి వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని కవిగా, రచయితగా, ఉపాధ్యాయుడుగా, వక్తగా పేరొందిన శంకరమంచి శ్యాంప్రసాద్ పాలకుర్తి వాస్తవ్యుడు. పాఠశాల విద్యను పాలకుర్తిలో పూర్తిచేసుకొని, హైదరాబాదులోని ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాలలో పి.డి.సి. నుంచి ఎం.ఏ దాకా ఏడేళ్ళ పాటు చదువుకొన్నారు. ఎం.ఏ లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన ఆయన 1990లో మాసబ్ ట్యాంకులోని ప్రభుత్వ విద్యాతత్వ కళాశాల నుండి తెలుగు పండిత శిక్షణను పూర్తిచేసుకున్నారు. పగలంతా ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ సాయంత్రం పూట కళాశాల విద్యార్థిగా చదువును సాగించారు. 1991లో కేంద్ర ప్రభుత్వం పనిచేసి నిర్వహించే నవోదయ విద్యాలయంలో తెలుగు అధ్యాపకులుగా చేరి ముప్పైమూడేళ్ళపాటు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారు. శ్రీ శ్యాంప్రసాద్ ఉపాధ్యాయుడిగా తెలంగాణలోని కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలో పనిచేయడమే కాకుండా బీహారు రాష్ట్రంలోని దర్భంగా, సమస్తిపూర్ నవోదయ విద్యాలయాలోను పనిచేశారు. క్రమశిక్షణ, పరిశీలన నిరంతర అధ్యయనం. అధ్యాపనంలో విద్యార్థుల మనస్సును, అటు అధికారుల మన్ననలను పొందారు. ఒకచోట ఎంతకాలం పనిచేశామన్నది కాక ఏ విధంగా ప్రభావితం చేశామన్నది కొలబద్దగా ఆయన తన విధుల్ని నిర్వహించారు. విద్యార్థుల సామాజిక నేపథ్యం, సైకాలజీని అర్థం చేసుకొని ఆకర్షణీయంగా, ఆలోచనాత్మకంగా తన బోధనా వ్యాసంగాన్ని కొనసాగించారు. విద్యార్థులలో మాతృభాషాభిమానం కొడిగడుతున్న దశలో శ్యాంప్రసాద్ తను పనిచేసే విద్యాలయాలలో చుక్కా రామయ్య లాంటి మేధావులను, సుద్దాల అశోక్ తేజ వంటి కళాకారుల్ని రప్పించి, విద్యార్థులలో స్ఫూర్తి నింపేలా కృషిచేశారు. ఉపాధ్యాయుడుగాఅటు ఉత్తమ సాహిత్యవేత్త గాను రాణించి పదవీ విరమణ చేస్తున్న డా. శంకరమంచి శ్యాంప్రసాద్ బోధన, రచనా స్రవంతులు నిరంతరం ఇరుదరులుగా ఒరుసుకొని సాగాలని కోరుకుందాము. జీవితంలో ఎదురైనా ఒడిదొడుకులను ఒడుపుగా ఎదుర్కొంటూ సాగిన ఆయన గమనం వర్తమాన యువతకు స్ఫూర్తినిస్తుందని ఆశిద్దాం.

## దమ్మాయిగూడ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

### వినాయక చవితి,బతుకమ్మ ఉత్సవాల కోసం 9 లక్షల కేటాయింపు



**కీసర, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చైర్ పర్సన్ వసుపతి ప్రణీత గౌడ్ ఆధ్వర్యంలో కౌన్సిల్ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరైనారు. అనంతరం ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సమక్షంలో దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని 18 వార్డులకు అభివృద్ధికి కావాల్సిన ఫండ్ గురించి తీర్మానాలు చేశారు. ప్రతి వార్డుకు రూ.ముప్పై లక్షలు చొప్పున నిధులు జనరల్ ఫౌండ్ ద్వారా కేటాయిస్తూ అలాగే పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి. భవాని నగర్ ఓపెన్ నాలాకు గ్రిల్స్ ఏర్పాటు,మున్సిపాలిటీ కి సంబంధించిన వాహనాలకు జీ పీ ఎస్ ట్రాకర్ ను ఏర్పాటు చేశారు. రానున్న వినాయక చవితి,బతుకమ్మ ఉత్సవాల కోసం అవసరాల నిమిత్తం తొమ్మిది లక్షల సాధారణ నిధుల నుంచి కేటాయించడం జరిగింది. ఈ సమావేశంలో కమిషనర్ ఎ.నాగమణి,వైస్ చైర్మన్ మదిరెడ్డి నరేందర్ రెడ్డి, కౌన్సిలర్ల నాను నాయక్,నాగాయిపల్లి సుజాత మంగళాపూరి వెంకటేష్,కొత్త సురేఖ గౌడ్,వరగంటి వెంకటేష్,సంపన బోలు స్వప్న హరి గౌడ్,గోగుల సరిత వెంకటేష్,ముప్ప శ్రీలత,గురువెల్లి వెంకటరమణ, ఫాండాల అనురాధ యాదగిరి గౌడ్, వసూపతి రమేష్ గౌడ్,మాదిరెడ్డి నరసింహ రెడ్డి,మొర మౌనిక నరహరి రెడ్డి,రామరం శ్రీహరి గౌడ్, కో –ఆప్షన్ సభ్యులు వదియాల రజినీ,వహీదా బేగం,మేనేజర్ వెంకటేశం, మున్సిపల్ సిబ్బంది,వాటర్ వర్క్స్ ఎఈ పాల్గొన్నారు.

# పిఎంసి మేయర్‌గా అమర్ సింగ్ బాధ్యతలు



**మేడిపల్లి, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** పిఎంసి మేయర్ పై పెట్టిన అవిశ్వాసం నెగ్గి శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు మేయర్ గా అమర్ సింగ్ ను ఎన్నుకున్నారు. అనంతరం పీర్జాదిగూడ నూతన మేయర్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు నూతన మేయర్ ను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆపై పిఎంసి నగర వీధుల్లో భారీ ర్యాలీగా ఎన్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్ర రెడ్డి, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, డిప్యూటీ మేయర్ శివ కుమార్ గౌడ్, పిఎంసి కమిషనర్, కార్పొరేటర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా సీతారాముల కళ్యాణం



**ఉప్పల్, ఆగస్టు30 (నిఘా న్యూస్):** శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా ఉప్పల్లోని శ్రీ రామచంద్ర స్వామి దేవస్థానంలో శ్రీ సీతారాముల కళ్యాణం కన్నుల పండుగ జరిగింది. పునర్వసు నక్షత్రం, శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం శ్రీ రామ జన్మ నక్షత్రం సందర్భంగా శ్రీ రామచంద్ర స్వామి దేవస్థానంలో స్వామి వారికి ఉదయం 7 గంటలకు అష్టోత్తర శత కలశాభిశేకం అనంతరం శ్రీ సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు, మహిళలు పాల్గొన్నారు. మధ్యాహ్నం మహా మంగళహారతి, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రతినిధులు ఎం కృష్ణ శర్మ, ఎం.వి.శర్మ, అక్షయ్ శర్మ ల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారి అనుగ్రహాన్ని పొందారు.

# కోర్టుల వ్యవస్థను మెరుగు పరచాలి

### భారత జాతీయ మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి



**మధిర, ఆగస్టు 30(నిఘా న్యూస్):** రోజురోజుకు మహిళపై పెరుగుతున్న దాడులను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన కోర్టుల వ్యవస్థను మెరుగు పరచాలని భారత జాతీయ మహిళా సమైక్య ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలం పరిధి మల్లవరంలో జిల్లా నాయకురాలు మందడపు రాణి అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి లతా దేవి తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2012వ సంవత్సరంలో జరిగిన నిర్భయ ఉదంతం అనంతరం రాష్ట్ర కోర్టులను ఏర్పాటు చేసిన ఇంకా మహిళపై దాడులు పెరుగుతున్నాయే తప్ప తగ్గటం లేదన్నారు. ఉన్నావ్ అత్యాచార ఘటన కారణంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టుల వ్యవస్థ మీద నమ్మకం సన్నగిల్లే అవకాశం ఎక్కువగా కనబడుతుంది అన్నారు. మహిళపై లైంగిక దాడులకు పాల్పడిన ప్రజాప్రతినిధులపై విచారణ నత్తనడక సాగటం దారుణమైన విషయమన్నారు. కోల్కతాలో జరిగిన యువ డాక్టర్‌పై అత్యాచార ఘటన మరో నిర్భయ ఉదంతాన్ని చవి చూసిందన్నారు. అత్యాచార ఘటనను బిజెపి రాజకీయాలకు వాడుకుంటుందని ఆమె మండిపడ్డారు. ఘటన జరిగిన ఆరు నెలల కాలంలో నిందితులకు శిక్ష పడేలా ఏర్పాటు చేసిన ఫాస్ట్ ట్రాక్ కోర్టులను పాలకులు కావాలనే బలహీనపరుస్తున్నారని, వాటిని మరింత మెరుగుపరిచి మహిళలు, బాలికలపై జరిగే లైంగిక వేధింపులకు తక్షణమే పరిష్కారమయ్యేలా చూపాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధిర మండల నాయకురాళ్ళు సుజాత, ఎం.శ్రీకృష్ణ, మచ్చా పద్మ, మందడపు సావిత్రి, మొగలి తులసి, ఎర్ర నాగుల భూలక్ష్మి, మందడపు నాగమణి కొంగర తులసమ్మ తదితరులు పాల్గొన్నారు.

### బిక్కవోలు విలేకరులపై...

# తప్పుడు కేసులు కొట్టేసిన కోర్టు







- అక్రమ కేసుగా అభివర్ణించిన ఎస్సీ ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం
- అక్రమ కేసులపై న్యాయస్థానం తీర్పుతో నేతల్లో భయం భయం

**అనపర్తి, ఆగస్టు30 (నిఘా న్యూస్):** తూర్పు గోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం బిక్కవోలు మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ కు చెందిన 12 మంది విలేకరులపై అప్పటి వైసిపి ప్రభుత్వం %శ్రీ% అక్రమ కేసు పెట్టి జైలుకు పంపిన విషయం విధితమే. ఆ కేసుకు సంబంధించి తూర్పు గోదావరి జిల్లా ఎస్సీ ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం ఆగస్టు 28బుధవారం అక్రమ కేసుగా పరిగణిస్తూ సాక్ష్యాధారాలు లేనందువల్ల కేసు కొట్టేస్తున్నట్టు తీర్పు ఇచ్చింది. అనంతరం స్థానిక ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని, పందల పాక గ్రామ ఉపసర్పంచ్ బుజ్జిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా బిక్కవోలు మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం వి వి ఎస్ఎన్ రెడ్డి (సూర్య రెడ్డి) మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో ప్రభుత్వ తప్పులను పత్రికల్లో ప్రచురిస్తున్న కారణంగా అక్రమ కేసు పెట్టి జైలుకు పంపించడం జరిగిందన్నారు. ఆ సమయం నుండి న్యాయస్థానంలో కేసు కొట్టేసేంతవరకు అండగా నిలబడిన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, పందలపాక గ్రామ ఉపసర్పంచ్ పడాల వెంకట రామారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా వైసిపికి చెందిన ముగ్గురు నాయకులు కూడా కేసు గెలవడానికి సహాయం చేశారని వారికి ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆయన అన్నారు. ఇష్టం వచ్చినట్లు మాపై వార్తలు రాసిన కొన్ని పత్రికలు, మరి కొందరు సాంఘిక మాద్యమాలలో మాపై దుష్ప్రచారం చేశారని దానికి సంబంధించిన అన్ని సాక్ష్యాధారాలు మా వద్ద ఉన్నాయని, ఎవరినీ విడిచిపెట్టే ప్రసక్తి లేదని వారిపై న్యాయ పోరాటం చేయడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. తోటి పత్రిక సోదరుల అయ్యివుండి లేనిపోని దుష్ప్రచారం చేసి పరువు నష్టం గావించారని అటువంటి వారిని వదిలితే రేపు వేరొకరిని కూడా ఇలానే చేస్తారని పేర్కొన్నారు. కనుక తప్పక న్యాయపోరాటం చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. అనంతరం కేసు వాదించిన సీనియర్ లాయర్ సలాది నారాయణమూర్తినీ కలిసి ఘన సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిక్కవోలు మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ర్యాంకుల నీడలో... క్రీడలను ప్రోత్సహించని పాఠశాలలు

- జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా పోటీలు
- విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే చదలవాడ





**నరసరావుపేట, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** నరసరావుపేటలోని బరంపేట కాసు బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ పాఠశాలలో అంతర్జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురు, శుక్రవారల్లో జరిగిన వివిధ అంశాల ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, పెదకూరపాడు తహసిల్దార్ మీసాల డానియేలు, మాజీ కౌన్సిలర్స్ కొలిపాక చంద్రశేఖర్, షేక్ అబ్దుల్ గఫర్, డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు స్టేడియం డెవలప్మెంట్ సొసైటీ అడ్వైజర్, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మాజీ ఇంచార్జ్ సభ్యులు యస్.కె.జిలాని మాలిక్, పాఠశాల హెడ్మాస్టర్ డి.జహరయ్య, కరిముల్లా మాస్టర్, పిఇటీ. ఇజ్రాయల్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడలను ప్రోత్సహించాలనీ, శారీరకంగా, మానసికంగా, దృఢంగా ఉండాలంటే, మనకు ఇష్టమైన ఏదో ఒక ఆటల్లో పాల్గొనాలని, క్రీడల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, నాడు ప్రభుత్వాలతో పాటు, దాతలు, విద్యార్థుల తల్లిదండ్రులు, క్రీడలపై ఎక్కువ శ్రద్ధ కనబరిచేవారనీ, నేడు ర్యాంకుల కోసం పోటీ పడి క్రీడల్ని విస్మరిస్తున్నారన్నారు. మాజీ కౌన్సిలర్ కొలిపాక చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా పాల్గొని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. మాజీ కౌన్సిలర్ అబ్దుల్ గఫర్ మాట్లాడుతూ రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు క్రీడలను ప్రోత్సహించాలన్నారు. ఎస్.కె. జిలాని మాలిక్ మాట్లాడుతూ గెలిచినవారు గర్వపడరాదని, ఓడినవారు నిరుత్సాహపడరాదని, గెలుపు ఓటమిలను సమానంగా స్వీకరించాలని, ప్రతి ఒక్కరు చదువుతో పాటు వివిధ క్రీడాంశాలలో తమ ప్రతిభను చూపించి, తల్లిదండ్రులకు, ఊరికి, చదువుకున్న పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. తహసిల్దార్ మీసాల డానీయేలు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి, ఉన్నత శిఖరాలను అధిరోహించి, అమ్మ నాన్నల ఆశలు నెర వేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధుల నివారణకు...

# ప్రభుత్వ ఆసుపత్రులు సర్వసన్నద్ధం

### రాష్ట్ర వైద్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్



**రాజేంద్రనగర్, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నాయి. కావున ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వ ఆసుపత్రుల డాక్టర్లు, వివిధ వర్గాల వైద్య సిబ్బంది, వైద్య సిబ్బంది సంసిద్ధులై ఉన్నారని రాష్ట్ర వైద్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ వెల్లడించారు. వర్షాల కారణంగా ఎదురయ్యే అనారోగ్య సమస్యల నుండి ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు డాక్టర్లు, వైద్య సిబ్బంది పూర్తిస్థాయిలో సన్నద్ధతతో ఉన్నారని సూచించారు. ప్రజలకు సీజనల్ వ్యాధులు సంక్రమించిన కానీ, సీజనల్ వ్యాధులకు భయపడకుండా ప్రభుత్వ ఆసుపత్రులలో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వాసుపత్రులలో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని ప్రజలకు భరోసా కల్పించారు. రాష్ట్ర వైద్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ పర్యవేక్షణలో భాగంగా రాజేంద్రనగర్ లోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పర్యటించి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గలతో ఆసుపత్రిలో కలియ తిరుగుతూ వివిధ వైద్య విభాగాలను పరిశీలించారు. ఓ.పి విభాగంలో రోజుకు ఎంతమంది వైద్య సేవలు పొందుతున్నారని తెలుసుకున్నారు. ప్రసవాలు జరుగుతున్నాయా అని ఆరా తీశారు. ల్యాబ్ విభాగాన్ని పరిశీలించారు. రాజేంద్ర నగర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గలత ఆధ్వర్యంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నాయి. కావున మలేరియా, డెంగ్యూ తదితర కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, డాక్టర్లకు, వైద్య సిబ్బందికి సూచించారు. తదనంతరం టీబి వ్యాధి నివారణకు సురక్షితమైన టీబి బీసీజీ టీకా అని తెలిపారు. బీసీజీ టీకా అవశ్యకతను వివరిస్తూ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారిణి విజయ పూర్ణిమ, ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ సమీనా నస్రీన్, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### 11 కోట్ల సభ్యత్వంతో...

# ప్రపంచలోనే అతి పెద్ద పార్టీ బీజేపీ

### ప్రపంచలోనే ఎదురులేని ప్రధానమంత్రి మోడీ

### అందెల శ్రీరాములు యాదవ్




**బాలాపూర్, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** 11 కోట్ల పార్టీ సభ్యత్వాలతో ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిందని మహేశ్వరం నియోజకవర్గం బీజెపీ ఇంచార్జీ అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. శుక్రవారం బడంగ్ పేట్ లో పార్టీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సభ్యత్వ నమోదు 2024 కార్యక్రమంలో ముఖ్యఅథితులుగా వనపర్తి జిల్లా ఇంచార్జీ బోసుపల్లి ప్రతాప్, రాష్ట్ర నాయకులు అందెల శ్రీరాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలలో తిరులేనిశక్తిగా ఆవిర్భవించిందని అన్నారు. కార్యకర్తలు అదే ఒరవడి కొనసాగిస్తూ సభ్యత్వ నమోదులు చేపట్టాలని సూచించారు. దేశంలో అన్నివర్గాల ప్రజలు బీజేపీ పాలనను అంగీకరిచాయని, దేశంలో మూడవసారి బీజేపీ అధికారంలోకి వచ్చిందనన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యత్వ నమోదు కన్వీనర్ నడికుడ యాదగిరి, ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్ రెడ్డి, కార్పొరేటర్లు గడ్డం లక్ష్మరెడ్డి, గుడెపు ఇంద్రసేనా, నాయకులు నిమ్మల శ్రీకాంత్ గౌడ్, తర్రే మల్లేష్ యాదవ్, చిత్రం శ్రీను, గుండె నాగార్జున, లాల సందీప్, మోతీలాల్ నాయక్, పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జక్కిడి మధుసూదన్ రెడ్డి, జంగారెడ్డి, రేసు నర్సింహారెడ్డి, లక్ష్మణ్, జోరాల ప్రభాకర్, రామకృష్ణా రెడ్డి, పెరిమోని నరేష్, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే వీరేశంకు అవమానం



**వలిగొండ, ఆగస్టు 30(నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి పనులపై సమీక్ష సమావేశానికి నకిరేకల్ దళిత ఎమ్మెల్యే వేముల వీరేశం రావడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి స్వాగతం పలికేందుకు వచ్చిన ఎంఎల్ఏ ను గుర్తుపట్టని పోలీసులు, మంత్రులకు స్వాగతం పలికేందుకు లోపలికి అనుమతించక పోవడం చర్చనీయాంశంగా మారింది. దీనితో సదరు కార్యక్రమంలో నుండి అలిగి వెళ్లిపోయిన ఎమ్మెల్యే వీరేశం.

# ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్‌కు సిద్ధమైన చెన్నై




**హైదరాబాద్, ఆగస్ట్30 (నిఘా న్యూస్):** దేశంలోనే మొట్ట మొదటి నైట్ రేస్‌లకు తమిళనాడు ప్రభుత్వం మద్దతుతో ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్-2024 కు ఎడిషన్ కు ఆతిథ్యం ఇచ్చేందుకు చెన్నై నగరం సిద్ధమైందని రేసింగ్ ప్రమోషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్, ఎండీ అఖిలేష్ రెడ్డి శుక్రవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ శని, ఆదివారాల్లో చెన్నై మహా నగరంలో ఏర్పాటు చేసిన 3.5 కి.మీ స్ట్రీట్ సర్క్యూట్‌లో ఇండియన్ రేసింగ్ లీగ్, ఫార్ములా-4 కార్లు దూసుకెళ్ల నున్నాయని తెలిపారు. రేసింగ్ ప్రమోషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రమోట్ చేస్తున్న ఈ నైట్ రేస్ భారతీయ మోటార్ స్పోర్ట్స్‌లో కీలక మైలురాయిగా నిలవనుందన్నారు. ప్రేక్షకులు సౌకర్యవంతంగా, భద్రతతో రేసులను ఆస్వాదించేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని తమిళనాడు యువజన సంక్షేమం, క్రీడల అభివృద్ధి అదనపు ముఖ్య కార్యదర్శి డాక్టర్ అతుల్య మిశ్రా తెలిపారు.

# హెచ్ సిఏను రద్దు చేయాలి

### తెలంగాణ క్రికెట్ అసోసియేషన్



**ఉప్పల్, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ లో ఆర్థిక అవక తవకలు జరిగాయని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆరోపించింది. దీనిపై విచారణ జరిపించి హెచ్‌సిఏ ను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. బీసీసీఐ నిధులను కూడా దుర్వినియోగం చేసిందని మండిపడింది. మాజీ అధ్యక్షుడు అజారుద్దీన్, ప్రస్తుత అధ్యక్షుడు జగన్మోహన్ హయాంలో కూడా అవినీతి జరుగుతోందని విమర్శించింది. సుప్రీం తీర్పును హెచ్‌సిఏ ఖాతరు చేయట్లేదని విరుచుకు పడింది.

# ఘనంగా మణిద్వీప పూజ



**సికింద్రాబాద్, ఆగస్టు 30 (నిఘా న్యూస్):** శ్రావణమాసం ఆఖరి శుక్రవారం పురస్కరించుకొని నామాలు గుండు ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో బిఎన్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో విశ్వేశ్వరరావు జ్యోతి ఆధ్వర్యంలో ఆర్యవైశ్య సంఘం సహకారంతో మణిద్వీప వర్ణన, పంచ హారతుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిబిజిఎఫ్ ఫౌండేషన్ మడిపడి రాజు విశ్వేశ్వరరావు శ్రీరామ రాజు ప్రభాకర్ సోమ మధు తదితరులు పాల్గొన్నారు.

# మూసి పరివాహకంలో... కూల్చివేతలకు హైడ్రా సన్నదం..!





- మూసి పరిసరాలలో 1154 ఆక్రమ నిర్మాణాల గుర్తింపు
- భూ కబ్జాదారుల గుండెల్లో దడ
- ఇండ్ల నిర్మాణానికి స్థలాలు అమ్మిన వారిపై వారిపై కేసులు తప్పవా..!

**అంబర్‌పేట, ఆగస్ట్ 30(నిఘా న్యూస్):** అంబర్ పేట మండల పరిధిలోని మూసీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలకు 'హైడ్రా' గుబులు పట్టుకుంది. మూసీ ప్రక్షాళనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తున్న విషయం తెలిసిందే. మూసీ రివర్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా అంబర్ పేట మండలంలోని మూసీ పరివాహక ప్రాంతాల్లో ఆక్రమంగా వెలిసిన దాదాపు 1154 నిర్మాణాలను గుర్తించినట్లు అధికారులు ధ్రువీకరించారు. ప్రధానంగా మండలంలోని గోల్నాక శాంతినగర్, న్యూ బ్రిడ్జి, లక్ష్మీ టాకీస్ పోచమ్మ టెంపుల్ లైన్ తులసీరామ్ నగర్ లంక, న్యూ తులసి రామ్ నగర్, కమలానగర్, దుర్గా నగర్, న్యూ దుర్గా నగర్, అలీ కేఫ్, రెడ్డి చికెన్ సెంటర్ లైన్ తదితర ప్రాంతాల గుండా మూసీ నది ప్రవహిస్తుంది. అయితే దశాబ్దాల క్రితం అప్పటి నిజాం ప్రభుత్వం ఈ మూసీ నది ఒడ్డున ఉన్న ఈ ప్రాంతాల్లోని స్థలాలను గడ్డి పెంచుకునేందుకు, వ్యవసాయం చేయడానికి మాత్రమే కొంతమందికి లీజుకి ఇచ్చింది. దీనిని ఆసరాగా చేసుకున్న సదరు లీజుదారులు స్వలాభం కోసం మూసీ ఎఫ్ టి ఎల్ పరిధిలోని స్థలాలను ఆక్రమంగా మట్టితో నింపి చదును చేసి ప్లాట్లుగా విభజించి ఇతరులకు విక్రయించారు. ఈ క్రమంలో గడ్డి పొలాల్లో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలను వెలిశాయి. ఈ విషయమై గతంలో పలుమార్లు రెవెన్యూ, జిహెచ్ఎంసి అధికారుల దృష్టికి వచ్చిన మూసీ స్థలాలను ఆక్రమంగా విక్రయించి సొమ్ము చేసుకున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మండలంలోని మూసీ పరివాహక ప్రాంతాల్లో వందల సంఖ్యలో ఆక్రమ నిర్మాణాలు జరిగి ఇక్కడ నది కాస్త పిల్ల కాలువలా మారిపోయింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసైట్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ( హైడ్రా) ను తెరపైకి తీసుకువచ్చింది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు హైడ్రా అధికారులు హైదరాబాద్ నగరంలోని చెరువులు, కుంటల్లో వెలిసిన ఆక్రమ నిర్మాణాలపై కొరడా జులిపిస్తుంది. ఒకటొకటిగా హైడ్రా ఆక్రమ నిర్మాణాలను కూల్చివేస్తూ చెరువులు, కుంటల పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. ఈ క్రమంలోనే హైడ్రా ఉన్నతాధికారులు మూసీ పరివాహక ప్రాంతాలపై దృష్టి సారించి అక్కడ ఎఫ్టిఎల్ పరిధిలో వెలసిన ఆక్రమ నిర్మాణాలను కూల్చివేసే దిశగా రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

అంబర్ పేట మండల పరిధిలో మూసీ పరివాహక ప్రాంతాల్లోని ఆక్రమ నిర్మాణాల కారణంగా వర్షం పడినప్పుడు చుట్టుపక్కల బస్తీలన్నీ వరద ముంపుకు గురవుతూ తాము ఇబ్బంది పడుతున్నామని ప్రజల నుండి హైడ్రా అధికారులకు ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. దీనిపై దృష్టి సారించిన హైడ్రాధికారులు అంబర్ పేట మండలంలోని మూసీ పరివాహక ప్రాంతాల్లో సర్వే నిర్వహించి అక్రమ నిర్మాణాలను గుర్తించారు. త్వరలో ఈ ఆక్రమ నిర్మాణాలపై చర్యలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.